**PRAYER OIL**

72 గం॥లు సంఘమంతా ఉపవాసముతో ప్రార్థించిన రివైవల్ యెరూషలేము ప్రేయర్ ఆయిల్ కొరకు సంప్రదించండి. రోగములు, బాధలు, దయ్యాలను పారిపోగొట్టగల శక్తివంతమైన

**ప్రేయర్ ఆయిల్**

**9542786220**

RNI - APTEL/2013/48347

# రియల్ క్రిస్టియన్ ఫ్యామిలి

ఆధ్యాత్మిక న్యూస్ పేపర్

# REAL CHRISTIAN FAMILY

Email : rcf2011mnm@gmail.com

EDITOR
S. NAGESWARAO (Jeevan)

Beside Latha Hospital, C/o Heaven Way Bible House, Old Gajuwaka ,Visakhapatnam-26, A.P. Cell:9396235152

Published from VISAKHAPATNAM | సంపుటి:3 సంచిక:03 | ఎడిటర్ : ఎస్. నాగేశ్వరరావు(జీవన్) | 2015 మార్చి | పేజీలు : 8 | ₹ : 10/-

## యేసుప్రభువు సిలువ మరణ ప్రవచనాలు - వాటి నెరవేర్పు

✦ **ప్రభువు తన స్నేహితుని ద్వారా అప్పగించబడుట :**

**ప్రవచనం :** నేను నమ్ముకొనిన నా విహితుడు నా యింట భోజనము చేసినవాడు నన్ను తన్నుటకై తన మడిమెనెత్తెను. **-కీర్తన 41:9.**

**నెరవేర్పు :** ఆయన ఇంకను మాటలాడుచుండగా పండ్రెండు మందిలో ఒకడగు యూదా వచ్చెను. వానితోకూడ బహు జనసమూహము కత్తులు గుదియలు పట్టుకొని ప్రధానయాజకుల యొద్దనుండియు ప్రజల పెద్దల యొద్దనుండియు వచ్చెను. ఆయనను అప్పగించువాడు-నేనెవరిని ముద్దుపెట్టుకొందునో ఆయనే యేసు; ఆయనను పట్టుకొనుడని వారికి గురుతు చెప్పి వెంటనే యేసు నొద్దకు వచ్చి- బోధకుడా, నీకు శుభమని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొనెను. యేసు-చెలికాడా, నీవు చేయవచ్చినది చేయుమని అతనితో చెప్పగా వారు దగ్గరకు వచ్చి ఆయనమీదపడి ఆయనను పట్టుకొనిరి. **-మత్తయి 26:47-50.**

✦ **ప్రభువు 30 వెండి నాణెములకు అమ్మబడుట :**

**ప్రవచనం :** మీకు అనుకూలమైనయెడల నా కూలి నాకియ్యుడి, లేనియెడల మానివేయుడని నేను వారితో అనగా వారు నా కూలికై ముప్పది తులముల వెండి తూచి యిచ్చిరి. **-జెకర్యా 11:12.**

**నెరవేర్పు :** అప్పుడు పండ్రెండుమందిలో నొకడగు ఇస్కరియోతు యూదా, ప్రధానయాజకులయొద్దకు వెళ్లి - నేనాయనను మీకప్పగించినయెడల నాకేమి ఇత్తురని వారినడిగెను. అందుకు వారు ముప్పది వెండి నాణెములు తూచి వానికి ఇచ్చిరి. వాడప్పటినుండి ఆయనను అప్పగించుటకు తగిన సమయము కనిపెట్టుచుండెను. **-మత్తయి 26:14-16.**

✦ **ప్రభువును అప్పగించిన ఇస్కరియోతు యూదా మరణించుట :**

**ప్రవచనం :** వాని బిడ్డలు తండ్రిలేనివారవుదురు గాక, వాని భార్య విధవరాలగును గాక. **-కీర్తన 109:9.**

**నెరవేర్పు :** అప్పుడాయన అప్పగించిన యూదా, ఆయనకు శిక్ష విధింపబడగా చూచి పశ్చాత్తాపపడి, ఆ ముప్పది వెండి నాణెములు ప్రధాన యాజకులయొద్దకును పెద్దల యొద్దకును మరల తెచ్చి - నేను నిరపరాధ రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారి-దానితో మాకేమి? నీవే చూచుకొనుమని చెప్పగా అతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి, పోయి ఉరిపెట్టుకొనెను. **-మత్తయి 27:3-5.**

సహోదరులారా, యేసును పట్టుకొనినవారికి త్రోవ చూపిన యూదాను గూర్చి పరిశుద్ధాత్మ దావీదు ద్వారా పూర్వము పలికిన లేఖనము నెరవేరవలసియుండెను. అతడు మనలో ఒకడుగా ఎంచబడినవాడై యీ పరిచర్యలో పాలుపొందెను? ఈ యూదా ద్రోహమువలన సంపాదించిన రూకలనిచ్చి యొక పొలము కొనెను. అతడు తలక్రిందుగాపడి నడిమికి బద్దలైనందును అతని పేగులన్నియు బయటికి వచ్చెను. **-అపో.కా॥ 1:16-18.**

... తరువాయి భాగం 2 వ పేజిలో ...

**ఉద్యోగ అవకాశం**

క్రైస్తవులకు మాత్రమే

**మారుమనస్సు, రక్షణానుభవం కలిగి, Xth ఆపై చదివి, పరిచర్య పట్ల ఆశక్తి మరియు సమర్పణ గలవారైయుండవలెను.**

సంప్రదించండి

**9396235152**

**ప్రార్థించండి**

దయతో ప్రార్థించండి! ఈ పత్రిక అభివృద్ధి కొరకు, అనేకులకు ఆశీర్వాదకరముగా నుండునట్లు ఆర్థిక సహాయము కొరకు, ఎడిటర్‌కు జ్ఞానాభివృద్ధి కొరకు మీ అనుదిన ప్రార్థనలో దయతో జ్ఞాపకం చేసుకొనండి.

ఈ నెల పుట్టినరోజు, పెండ్లిరోజు జరుపుకుంటున్న వారికి

**ఈ నెల వాగ్దానం**

మీరు తృప్తిపొందునంతగా నేను ధాన్యమును, క్రొత్త ద్రాక్షారసమును, తైలమును మీకు పంపించెదను.

- యోవేలు 2 : 19

**లోపలి పేజీల్లో...**

**సూచక క్రియలు మరియు అద్భుత కార్యములు** -2లో

**హెలెన్ కిల్లర్** -5లో

**యేసు ప్రభువు సిలువ ప్రవచనాలు వాటి నెరవేర్పు** -6లో

**వచ్చే సంచికలో...**

**ఆర్.సి.ఎఫ్ వార్షికోత్సవము**


## నీ సమయాన్ని ఎలా ఖర్చు చేస్తున్నావు?

**"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలే కాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి." - ఎఫెస్సీ॥ 5:15.**

70 సం॥లు జీవిత కాలములో ఒక మనిషి ఎలా తన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటాడని ఒక గొప్ప వ్యక్తి లెక్క వేసారు. ఆయన లెక్కల ప్రకారం... సుమారుగా మాత్రమే -

| | | | |
|---|---|---|---|
| 1. | నిద్ర | 23 సంవత్సరములు | 32.85 % |
| 2. | పని | 16 సంవత్సరములు | 22.85 % |
| 3. | టి.వి. | 8 సంవత్సరములు | 11.43 % |
| 4. | తినడం | 6 సంవత్సరములు | 8.57 % |
| 5. | ప్రయాణం | 6 సంవత్సరములు | 8.57 % |
| 6. | విశ్రాంతి | 4 1/2 సంవత్సరములు | 6.43 % |
| 7. | రోగాల కొరకు | 4 సంవత్సరములు | 5.71 % |
| 8. | వస్త్రములు ధరించుకొనుట | 2 సంవత్సరములు | 2.85 % |
| 9. | భక్తి, ప్రార్థన కొరకు | 1/2 సంవత్సరము | 0.71 % |
| | **మొత్తము** | **70 సంవత్సరములు** | **100 %** |

ఇందులో నీవు కొన్ని తగ్గించుకోవచ్చు. ఆ సమయాన్ని దేవుని కొరకు, పరిచర్య కొరకు హెచ్చించి, నీ సమయాన్ని సద్వినియోగపరచుకోవచ్చు. అవి - నిద్ర, టి.వి., ప్రయాణం, విశ్రాంతి, రోగాలు...




నీ నుండి దేవుడు కోరుకునేది ఆయన నీకిచ్చిన సమయాన్ని వృథా చేసుకొనక, నీకున్న ఒకే ఒక జీవితములో క్రీస్తు కొరకు మనము ఏమి చేయుదుమో, అదే నిలిచియుండునని గ్రహించు, **"జ్ఞాన హృదయము కలిగి నీ దినములు లెక్కింప నేర్చుకొందువా"...? - కీర్తన 90:12.**

దేవుడు అందరికి సమానంగా ఇచ్చినది సయయము. రాజులకు, పేదలకు, పండితులకు, పామరులకు, కూలివారికి, రైతులకు ఈ భూమి మీద జీవిస్తున్న ప్రతీ మనిషికి, జీవికి దేవుడిచ్చినది 24 గంటలే! నీ 24 గంటలు ఎలా వాడుకొంటున్నావు...?

1. మొదటి **3 గంటలు** ఖచ్చితంగా దేవునివి. దేవునికి ఇస్తున్నావా...? కనీసం రోజులో 2 1/2 గంటలు మించి 3 గంటలు.
2. మిగిలిన 21 గంటలు దేవుడు నీవు ఈ భూమి మీద బ్రతుకుటకు. నీకు తెలుసా...?
3. **8 నుండి 10 గంటలు** పనిచేయు. నీ రాబడిలో 10వ భాగము నమ్మకంగా దేవునికి ఇస్తున్నావా...?
4. **5 గంటలు** విశ్రాంతి తీసుకో.
5. మూడు పూట్లకు **ఒక గంట** భోజనానికి, **రెండు గంటలు** స్నాన పానాలకు కేటాయించుకో.
6. మిగిలిన **3 గంటలు** స్వవిషయాలకు ఉపయోగించి, ఆత్మీయులతో, మంచి స్నేహితులతో, కుటుంబముతో గడుపుటకు వాడుము. అప్పుడు నీ సమయము సద్వినియోగమౌతుంది.

### ఏ రోజు పని ఆ రోజే చేయకపోతే అది రేపటికి రెండంతలు అవుతుంది.

నీ జీవితంలో ఇప్పటికే అనేక సంవత్సరములు జరిగిపోయినవి. కాని 2015 సం॥ అలా ఉండకూడదు. ప్రభువు రాకడ సమీపించుచున్నది. గనుక మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసుకొనుచు; నీ సమయాన్ని తినివేసే సోమరి నిద్రకు, వ్యర్థమైన మాటలకు దూరముగా ఉండుము. టి.వి, ఇంటర్‌నెట్ వంటి ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తున్న ట్లుంటూ నేటి మానవుని మనస్సును ఇహలోక కార్యాలతో నింపుచు పరమ తండ్రిని మరచునట్లు చేస్తున్నవి! జాగ్రత్త! ఇప్పటికే నీ జీవితంలో ఎన్నో సంవత్సరాలు వృథాగా గడిచిపో యాయి. మరి నీవు క్రీస్తు కొరకు చేసినదేమిటి? పరీక్షించుకో, పశ్చాత్తాపపడు, క్రీస్తు కొరకు, నశించిపోతున్న ఆత్మల కొరకు నీ సమయాన్ని హెచ్చించు, దేవుని రాజ్యాన్ని ఈ సం॥లోనైనా నిర్మించుటకు ఈ క్షణము నుంచే పూనుకో.

**యేసు జన్మించి, మరణించి, తిరిగి లేచింది నీకొరకేనని చెప్పావా నీ స్నేహితునికి ? ఇప్పుడైనా! అదే గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ అని**

## తక్కువ ధరలో సువార్త పత్రికలు

మీ సంఘ అడ్రసుతో ప్రింట్ చేసి ఇస్తాము. (మినిమం 5వేలు కాపీలు చేయించుకోవాలి). వంద పత్రికల నుంచి లభ్యం. మీ చర్చి లేదా పరిచర్య, స్టాంప్ వేసుకునే వెసులుబాటుతో...

**గమనిక** :- మీరు నిజముగా నశించిపోతున్న ఆత్మలపట్ల భారం కలిగి, సువార్త పత్రికలు కొనుక్కునే పరిస్థితి లేకపోతే మీకు పత్రికలు పూర్తిగా ఉచితము.

(మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు).

వివరములకు సంప్రదించండి :-
**హెవెన్ వే బైబిల్ హౌస్ లేదా జె.సి.హోమ్**


## మార్చి MARCH = అదర్ (ADAR) యూదుల క్యాలెండర్

1. ఏడవ దినము - మోషే చనిపోయినందున ఉపవాసము. ద్వితీ॥ 34:5
2. పదిహేనవ దినము - పారశీక దేశములోని యూదులనందరిని ఎస్తేరు రక్షించిన సందర్భముగా చేయబడిన పూరీము విందు దినము. ఎస్తేరు 9:26
3. ఇరువది మూడవ దినము - జెరుబ్బాబెలు యొక్క మందిర ప్రతిష్ఠిత విందు దినము. ఎజ్రా 6:16.


బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పించుము, వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు.
చిన్నపిల్లలను దేవుని యొద్దకు ఎలా నడిపించాలి? R.C.F. ద్వారా

## ఏప్రిల్ నుంచి

1 SUNDAY SCHOOL TEACHERS TRAINING
సండేస్కూల్ టీచర్స్ ట్రైనింగ్ పొందుకునే అవకాశం

❖ 6 నెలల తరువాత 2 రోజులు సెమినార్ నిర్వహించి సర్టిఫికెట్ తో మెటీరియల్ మరియు అభిషేక ప్రార్థన తో సిద్ధపరచబడతారు.

2 SPOKEN ENGLISH for all
స్పోకెన్ ఇంగ్లిష్ (ప్రత్యేకంగా పాస్టర్లకు) (Special for Pastors)


## పరిశుద్ధ గ్రంథము లో ప్రత్యేక లక్షణము లు కలిగిన మనుష్యులు !

| లక్షణము | మనిషి పేరు | ప్రత్యేకత | ఆధారము |
|---|---|---|---|
| 11. అతి వేగంకలవాడు | : అశాహేలు | – పరిశుద్ధ గ్రంథములో ఇతని గూర్చి "అడవిలేడియంత తేలికగా పరుగెత్తగలవాడు" అని వ్రాయబడినది. | – 2 సమూ॥ 2:18 |
| 12. ప్రవక్తలలో గొప్పవాడు | : బాప్తిస్మమిచ్చు యోహాను | – ప్రభువైన క్రీస్తుకు ముందుగా నడచిన బాప్తిస్మమిచ్చు యోహాను | – మత్తయి 11:11 |
| 13. అపరాధులలో ముఖ్యుడు | : ఇస్కరియోతు యూదా | – ఇతడు రక్షకుని 30 వెండి నాణెముల కొరకు అమ్మి నమ్మకద్రోహము చేసెను | – మత్తయి 27:3-5 |
| 14. గర్విష్ఠి | : నెబుకద్నెజరు | – బబులోను రాజైన ఇతడు యెరూషలేమునునాశనము చేసెను. అయితే కొంతకాలమునకు దేవునికి విధేయత చూపించెను. | – దానియేలు 4 |

## సూచక క్రియలు మరియు అద్భుత కార్యములు

గత సంచిక తరువాయి భాగం .......

### తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు చేసిన సూచకక్రియలు

41. కల్వరియొద్ద జరిగిన అద్భుత కార్యములు.
    - అ. చీకటి కమ్ముట — మత్తయి 27:45; లూకా 23:44
    - ఆ. భూకంపము వచ్చుట — మత్తయి 27:51
    - ఇ. దేవాలయపు తెర పైనుండి క్రిందకు రెండుగా చినుగుట — మత్తయి 27:51; మార్కు 15:38
    - ఈ. సమాధులు తెరువబడుట, నిద్రించిన పరిశుద్ధుల శరీరములు లేచుట — మత్తయి 27:52,53
42. ప్రభువైన యేసు మృతిని గెల్చి లేచుట — మత్తయి 28; మార్కు 16; లూకా 24; యోహాను 20
43. యేసు ఆరోహణము — మార్కు 16:19,20; లూకా 24:50-52; అపొ॥ 1:4-11
44. పెంతెకొస్తు — అపొ॥ 2:1-4
45. ప్రార్థన చేయగానే వారు కూడియున్నచోటు కంపించుట — అపొ॥ 4:31
46. అననీయ మరియు సప్పీరాలపై తీర్పు — అపొ॥ 5:1-11
47. స్తెఫను మూడవ ఆకాశమును చూచుట — అపొ॥ 7:55,56
48. సౌలును గ్రుడ్డివాడుగా చేయుట — అపొ॥ 9:8
49. పరిశుద్ధాత్మ అన్యులమీద ఆవరించుట — అపొ॥ 10:44-46
50. పౌలును లేపుట (మృతినుండి?) — అపొ॥ 14:19-28; 2 కొరింథీ॥ 12:1-5
51. పౌలు, సీలలు చెరసాలనుండి విడుదల నొందుట — అపొ॥ 16:19-40

### ప్రభువైన యేసుక్రీస్తు చేసిన సూచక క్రియలు

1. నీళ్లను ద్రాక్షరసముగా మార్చుట — యోహాను 2:7,8
2. ఒక ప్రధాని కుమారుని స్వస్థపరచుట — యోహాను 4:50
3. కపెర్నహూము పట్టణములో అపవిత్రమైన దయ్యపు ఆత్మపట్టినవానిని స్వస్థపరచుట — మార్కు 1:25; లూకా 4:35

........ మరిన్ని వచ్చే సంచికలో ..............


నా(దేవుని) మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థములు భుజించుడి - యెషయా 55:2

## అల్ఫా ఓమెగా కేటరింగ్ & కుకింగ్

అతి తక్కువ ధరకు కేటరింగ్ చేయబడును

ప్రొ॥. ఎఫ్రాయిమ్ సెల్: 9704569906
డో.నెం: 23-8 27, సింహగిరి కాలని, గాజువాక -26


## సువార్త అందని ప్రాంతాలు చెప్పండి!

మీకు తెలిసిన లేదా మీరున్న ప్రాంతములో ఇంత వరకు సువార్త ప్రకటించబడకపోయినా లేదా సువార్త ప్రకటించాల్సిన అవసరమున్నా మాకు తెలియజేయండి చాలు. మేము టీమ్‌తో వచ్చి సువార్త ప్రకటిస్తాము.

**గమనిక** :- పత్రికలపై మీ అడ్రస్ ముద్రిస్తాము, స్థలము చెప్పండి చాలు.

**వివరములకు :- 9440930833, 8499813383.**

ఆత్మీయమైన మా మమ్మీలకు, డాడీలకు, బ్రదర్స్‌కు, సిస్టర్స్‌కు స్వాగతం! రండి ఈస్టర్‌కు కలిసి ఎంజాయ్ చేద్దాం!.



# ఎడిటో 'రియల్' మీరు ఏమైయున్నారు ?

## ప్రభువునందు ప్రియులైన పాఠకులకు క్రీస్తు కృపను బట్టి

**నూతన ఉద్దేశముతో**

వ్రాయునది ఏమనగా

దేవుని ఉచిత కృపను బట్టి 2014వ సంవత్సరాన్ని జయించి 2015లోనికి నడిపించ బడియున్నాము. అందును బట్టి దేవునికి స్తోత్రము.

దేవదేవుడు మనలను ప్రేమించి మరొక నూతన సంవత్సరము అనే దయా కిరీటాన్ని మనకను గ్రహించాడు. అయితే ఆయన ఉచిత కృప వలన పొందుకొన్న ఆ కిరీటాన్ని ఎలా కాపాడుకోవాలో ఎరిగియున్నారా?

గత 2014 అనే కిరీటాన్ని చాలా మందికి కాపాడుకొనే విధానం తెలియక దానిని నాశనం (పాడు) చేసుకున్నారు. కొందరైతే వారి జీవితాలను ఈ భూమి మీద లేకుండా చేసేసుకున్నారు.

కిరీటాన్ని రాజులు లేదా అర్హత కల్గిన వారు మాత్రమే ధరిస్తారు. ఆ కిరీటాన్ని మన సొత్తుగా నుంచుట కొరకే ఆయన రాజులకు రాజు గాను, ప్రభువులకు ప్రభువునైయుండి మనలను ఆయన కుమార్తెలుగా, కుమారులుగా రాజులైన యాజక సమూహముగా మార్చియున్నాడు.

ఇంతకి ఆ కిరీటాన్ని నీవు పొందుకున్నావా?

మీరు పొందుకున్నారో లేదో ఒకసారి పరిశీలన చేసుకోండి? ఈ క్రింది విధముగా ఉన్నారా?

**మత్తయి 5:13-14**

మీరు లోకమునకు **ఉప్పయి ఉన్నారు**. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యులచేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు.

**మత్తయి 5:14-16**

మీరు లోకమునకు **వెలుగైయున్నారు**. కొండమీద నుండు పట్టణము మరుగైయుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు కాని అది ఇంటనుండు వారికందరికి వెలుగిచ్చుటకై దీప స్థంభముమీదనే పెట్టుదురు. మీ సత్క్రియలను చూసి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

ప్రియులారా! పై వాక్యభాగం అర్ధమైందా?.

మీరు లోకమునకు ఉప్పుగాను, వెలుగుగాను జీవించవలెనని అలా జీవించినచో మీరు సత్క్రియలను అనగా మంచి క్రియలతో కూడిన మంచి జీవితము (దేవుని చిత్తానుసారమైన జీవితమును) కలిగియున్నచో, మీరు దేవునికి మహిమకరముగాను, అనేకులకు మాదిరికరమునైన జీవితమును జీవించి ఆయన అనుగ్రహించు కిరీటమును పొందుకునే వ్యక్తిగా లోకమునకు ఉప్పుగాను, వెలుగుగాను జీవించు. వాని వాని క్రియ చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద యున్నది.

నీ దేవుడు ఈ నూతన సంవత్సరమును నీకు దయాకిరీటముగా నిచ్చింది ఎందుకో ఇప్పటికైనా గుర్తించి నేటినుంచైనా ఆలాగున జీవించుటకు ప్రయత్నించు. దేవుడు నీకు అట్టి మహాకృపను దయచేయును గాక!. ఆమేన్.

**"మరణము వరకు నమ్మకముగా ఉండుము నీకు జీవకిరీటమిచ్చెదను" - ప్రకటన 2:11.**

**"ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును." - యాకోబు 1:12**

జీవన్

# సెయింట్ ఆగస్టీన్

**మనిషిగా మార్పుచెంది మహిమ పొందాలను మానవ లోకానికి ప్రచురపరచిన మహిమెపాధ్యాయుడు, రోమన్ కాథలిక్ మిషను (ఆర్.సి.ఎమ్) ఆచార్యుడు.**

**సెయింట్ ఆగస్టీన్ ప్రపంచ క్రైస్తవ లోకానికి (ముఖ్యంగా ఆర్.సి.ఎమ్. వారికి) ఆచార్యుడిగా, ఫాదర్‌గా, గురువుగా సుపరిచితుడు. ఒకనాటి పాపి. ఐతేనేం అతనిలోని మార్పు విమర్శకులను సైతం ఆలోచింపచేసింది. తన కాలంలో వాగ్దాటితో క్రీస్తు సువార్తను ప్రబోధించి ఎందరికో ఆదర్శప్రాయుడయ్యాడు. ఆ మహానుభావుడి క్లుప్త జీవితగాధను యిప్పుడు వినండి.**

నార్త్ ఆఫ్రికా దేశములోని చిన్న పట్టణములో ఆగస్టీన్ జన్మించాడు. తండ్రి విగ్రహారాధికుడు. తల్లి మంచి క్రైస్తవ విశ్వాసురాలు. చిన్ననాటి ఆగస్టీన్ మనస్సు చదువుకంటే కూడా సరదాల తట్టు మొగ్గింది. విచ్చలవిడి విలాసాలతో కాలక్షేపం చేసేవాడు. క్రైస్తవ విశ్వాసాలను తృణప్రాయంగా త్రోసి పుచ్చేవాడు. విలాసాలు, దొంగతనాలు, వ్యభిచారం, వ్యసనాలు, కొట్లాటలు యివి తన చిన్ననాటి నేస్తాలు. వేరే వారి ద్రాక్షతోటల్లోకి చొరబడి ద్రాక్షపండ్లను దొంగిలించి పందులకు ఆహారంగా వేసేవాడు. అందులో వుండే అల్ప సంతోషం కోసం, స్వల్ప సరదా కోసం.

17 సం॥ల ప్రాయంలో అంతా కాకపోయినా కొంతవరకు తన మనస్సు మార్చుకొని కార్తెజ్‌లోని హైస్కూల్‌లో చేరాడు. అనుకోకుండా తనకు చదువు బాగా అబ్బింది. తనమీద వున్న తిరుగుబోతు, జులాయి బిరుదులకు భిన్నంగా బాగా చదువుకోసాగాడు. గొప్ప కవుల, విజ్ఞాన వేత్తల పుస్తకాలను ఎడతెరపి లేకుండా పఠించేవాడు. ఐతే తల్లి క్రైస్తవ విశ్వాసాలకు విరుద్ధమైన హేతువాద సిద్ధాంతాల తట్టు ఆకర్షితుడయ్యాడు. ఏదైతేనేం ఈ పరిస్థితుల నడుమ ఆగస్టీన్ తన చదువును ముగించాడు. తను నేర్చుకొన్న సిద్ధాంతాలు అమ్మకు తెలిస్తే కోపిస్తుందని తన యీ క్రైస్తవ విరుద్ధ భావాలను ఆమెకు తెలియనివ్వకుండా ఇంట్లో నటించేవాడు. తొందర్లోనే తల్లి మోనికా కొడుకులోని యీ ప్రవర్తనను పసిగట్టింది. క్రీస్తు పట్ల తనకున్న వ్యతిరేక భావాల నిమిత్తం దేవుని యందు పశ్చాత్తాపంతో ప్రాధేయ పడమంది. కాని కొడుకులో ఏ మార్పు కనబడలేదు. చివరకు కొడుకు మీద అసహ్యాన్ని ఆపుకోలేక చీదరించుకొంది. అంతటితో ఆగకుండా ఇంట్లో నుంచి గెంటేసింది. కొడుకు మారుమనస్సు పొంది క్రీస్తులో రక్షణ పొందాలని దేవుని ముందు కన్నీటితో - కఠిన ఉపవాసాలతో ప్రార్థించేది ఆ తల్లి. ఏదో ఒక రోజు తన కొడుకు ఆగస్టీన్ రక్షణ పొంది గొప్ప క్రైస్తవుడు అవుతాడని నిరీక్షించింది. అతడి మార్పుకోసం రేయిబగళ్ళు ప్రభువు పాదల చెంత గోజాడింది. ఆ సమయంలో ఆగస్టీన్ లెక్చరర్‌గా పనిచేస్తూ కార్తేజ్‌లో ఉండేవాడు. తను ప్రొఫెసర్ పదవికోసం అప్లై చేసిన ధరఖాస్తు సెలక్టు కాబడిందని, వెంటనే బయలుదేరి రోమాకు రావల్సిందిగా అక్కడి నుండి పిలుపు వచ్చింది. ఆగస్టీన్ రోమాకు బయలుదేరాడు. అక్కడ కొడుకు చెడిపోతాడేమో అని భయపడి రోమాకు వెళ్ళవద్దని కొడుకును వేడుకుంది మోనికా. అమ్మను శాంతపరచడానికి "నేను వెళ్ళను" అంటూ అబద్ధమాడాడు. తన గురించి దిగులుపడకుండా ప్రశాంతంగా ఉండమని బుజ్జగించి ఆమెను స్వంతవూరికి సాగ నంపాడు. ఆమె అలా వెళ్ళిపోగానే అతడు ఇలా రోమా పట్టణానికి పోయే ఓడ ఎక్కాడు.

రోమాలో కాలాన్ని వెళ్ళదీస్తున్న ఆగస్టీన్‌లో నెమ్మదిగా తన పాపలతట్టు పశ్చాత్తాపం రావడం ప్రారంభమైంది. దూరంలో తన కోసం తల్లి చేస్తున్న ప్రార్థనలు కొంచెం కొంచెంగా పనిచేయడం మొదలుపెట్టాయి. ఆగస్టీన్ తనను తాను తరచి చూచే (ఆత్మపరిశీలన) ప్రయత్నం చేయగా తను ఇదివరలో చేసిన పాపాలు తనకు ఎన్నో నిద్రలేని రాత్రులను మిగిల్చాయి. తన కొడుకు రోమాలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుసుకున్న ఆగస్టీన్ తల్లి అక్కడకు చేరుకుంది. భార్య వల్ల కొంతవరకైనా మారతాడని భావించి కొడుకుని పెండ్లి చేసుకోమని బలవంతపెట్టింది. ఐతే ఆమెకు తెలియని చేదు నిజం ఒకటుంది. అప్పటికే ఆగస్టీన్‌కు ఒక వేశ్యతో సంబంధముంది. ఆ వేశ్య వలన అతనికి ఒక కొడుకు కూడా కలిగాడు. సంఘ ప్రతిష్టల దృష్ట్యా అతనిని తన కొడుకుగా ఒప్పుకోవటానికి ఆగస్టీన్ నిరాకరించాడు. పరువు ప్రతిష్టల కోసం పరిస్థితులకు తలవంచక తప్పలేదు. ఆ వేశ్యను పెళ్ళాడటానికి ఆ పరువు ప్రతిష్టలే అడ్డుపడ్డాయి.

నిదానంగా ఆగస్టీన్ క్రీస్తు గురించి ఆలోచిస్తున్న కొద్దీ తన జీవితం పట్ల అంతర్మధనం మొదలైంది. మెల్లగా మారు మనస్సు రావటం ప్రారంభమైంది. కొంతకాలం పాపాలకు దూరంగా ఉండేవాడు. మరలా అంతలోనే సాతాను చేత శోధింపబడి వాటితట్టు మరలా మొగ్గేవాడు. కాలం యిలా గడుస్తుంది. ఆగస్టీన్‌లో ఈ అంతర్మధనానికి అంకురం వేసింది. అప్పటికే ఫాదర్‌గా రోమాలో పనిచేస్తున్న అంబ్రూస్ దైవ సందేశాలు, హితబోధలు, యివి తనను ఆలోచింపజేసాయి. ఇలా ఆగస్టీన్ తన పాపాలతో యుద్ధం చేస్తున్న తరుణంలో ఒక రోజు అతడు సాయంత్రం పూట సరదాగా తోటలో సంచరిస్తుండగా అకస్మాత్తుగా చిన్న స్వరం "నువ్వు బైబిలు గ్రంథం తెరచి **రోమా 13:13,14** వచనాలు చదువు" అంటూ గద్దించటాన్ని అతడికి స్పష్టంగా గోచరించింది. హడావుడిగా తన గదిలోనికి పోయి పుస్తకాల షెల్ఫ్‌లో నుంచి పరిశుద్ధ గ్రంథాన్ని తీసి ఆ వచనాల్ని చదివాడు. అందులో ఇలా ఉంది, "అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తయి నను లేకయు కామ విలాసములైనను, పోకిరి చేష్టలైనను, లేకయు కలహమైనను, మత్సరమై నను లేకయు పగటియందు నడుచుకొను నట్లు మర్యాదగా నడుచు కొందము. మెట్టుకు ప్రభువైన యేసుక్రీస్తును ధరించు కొనినవారై శరీరేచ్ఛలను నెరవేర్చుకొను టకు శరీరము విషయమై ఆలోచన చేసుకొనకుడి."

"ఈ విషయాలను చదువుతుండగా నా కంటి నుండి ఉబికివస్తున్న కన్నీళ్ళు కెరటాలకు అడ్డువేయలేకపోయాను. పాపాలతో నిండిన నా బ్రతుకును తలుచుకొని వెక్కివెక్కి యేడ్చాను. ఇలా జరగటం నాకు ఒక సరిక్రొత్త అనుభవం. యింతకు ముందు ఎందరో ఫాదర్లు నాకు మారుమనస్సును గూర్చి చెప్పగా విన్నాను గాని, అవి నాకు వర్తిస్తాయని కలలో కూడా ఊహించలేకపోయాను. క్రీస్తు పరిశుద్ధ రక్తం, నా తల్లి కన్నీటి ప్రార్థనల విజ్ఞాపనల ఫలితంగా ముత్యాలకంటే అమూల్యమైన యీ పాపికి పశ్చాత్తాపాన్ని దేవుడు నాలో పుట్టించి, దాని వల్ల రక్షణ అనే కిరీటంతో నన్ను అభిషేకించాడు" అని ఆగస్టీన్ తన డైరీలో వ్రాసుకొన్నాడు. తనలోని చీకటి అదృశ్యమైపోసాగింది. సంతోషంతో గంతులు వేస్తూ 'నేను మార్పు చెందిన మనిషిని - కృపచూపబడ్డ పాపిని' అని అలౌకిక ఆనందంతో తన మార్పును గురించి సాక్ష్యమివ్వసాగాడు. క్రీస్తు రక్షణను అందుకోకుండా చేసిన అన్ని లోక తార్కికవాద పుస్తకాలను కిరసనాయిలు పోసి కాల్చేశాడు. తన ఆధ్యాత్మిక గురువైన అంబ్రూస్ ద్వారా బాప్తిస్మము పొందాడు. ఒకరోజు **391వ** సం॥లో అంబ్రూస్ ఫాదర్ గారిని పలకరించటానికి హిప్పో పట్టణానికి వెళ్ళాడు. అక్కడ ఆగస్టీన్‌ను చర్చిలో ఆదివారం ఆరాధనలో బిషప్ వర్లస్ గారు చూడగానే ఆరాధన కోసం తను తయారు చేసుకొన్న ప్రసంగాన్ని ప్రక్కన పెట్టి పరిశుద్ధాత్మ ప్రేరేపణతో "హిప్పో పట్టణంలో క్రీస్తుకు దైవ సేవకుల కొరత ఉందని, ఆత్మచేత ప్రేరేపించబడిన వారు ముందుకు రావల్సిందిగా ఆరాధనలో ప్రేక్షకులను ఆహ్వానించాడు." అక్కడున్న ఆగస్టీన్ పరిచయస్థులు వెనుక కుర్చీలో కూర్చొని మౌనంగా తనలో తాను రోధిస్తున్న ఆగస్టీన్‌ను ఆల్టర్ మీదకు ఆర్డినేషన్ (అభిషేకము) నిమిత్తం ముందుకు త్రోశారు. ఈ హఠాత్ పరిణామానికి అతడు కంగారుపడ్డాడు. ఇవి దైవిక పరిణామాలని దేవుని చిత్త ప్రకారమే జరుగు తాయని బిషప్‌గారు హితవు పలికారు.

వెంటనే అక్కడికక్కడే బిషప్ వర్లస్ ఆ పట్టణ ఫాదర్‌గా ఆగస్టీన్‌ను అభిషేకించాడు. క్రైస్తవ ఫాదర్ ఆగస్టీన్ సాధించిన విజయాలు, చేసిన సంస్కరణలను యావత్ ప్రపంచం ముక్తకంఠంతో ఆమెదించింది.

యీ ఆగస్టీన్ అనే శిలను ఒక శిల్పంగా మలిచింది తన తల్లి మోనికా ప్రార్థనలేనని అతడు గర్వంగా తర్వాత కాలంలో సాక్ష్యమిచ్చాడు. ఇంచుమించు 20 దశాబ్దాల క్రితం నాటి యీ ఆగస్టీన్‌ను యీ నాటికీ ఎందరో క్రైస్తవులు ఒక గొప్ప సంస్కర్తగా, మార్పు చెందిన మహామనిషిగా గుర్తిస్తారు. సెయింట్ అనే సత్కారంతో సెయింట్ ఆగస్టీన్‌గా రోమన్ కాథలిక్ మిషన్ వారికి యీ మహానుభావుడు యీ నాటికి చిరస్మరణీయుడు.

ప్రియ యౌవ్వనుడా! నీకు కూడా ఆగస్టీన్‌లా ముందు జీవితములో ఉన్నప్పుడే, ఇప్పుడైనా నేడే రక్షణ దినమని ఎరిగి క్రీస్తు నొద్దకు వచ్చి క్రీస్తు రక్తములో కడుగబడి పరిశుద్ధునిగా మార్పు చెంది అగస్టీన్ వలె దేవుని కొరకు జీవించు.

గమనించావా! నీ తల్లి కన్నీరు - యేసుక్రీస్తు రక్తము వ్యర్థము చేయక నేడే రక్షణపొందు.

---- oooo ----

**మీరు ఏమైయున్నారో అది దేవుని వలనేనని గ్రహించి - దేవుని కొరకు జీవించండి**

# 2015 స్త్రీ

ప్రభువు నందు అత్యంత ప్రియమైన ఆర్.సి.ఎఫ్ కుటుంబ పాలిభాగస్తులందరికి వ్రాయునది ఏమంటే..

కుటుంబం అనే మాట ప్రభువునకు ఎంతో ఇష్టం. అందులో స్త్రీ పాత్ర అంటే ఇంకా ఇష్టం. ఎందుకంటే స్త్రీ విధేయురాలు గనుక. కాకపోతే కొందరు అవిధేయురాండ్రు కూడా ఉండవచ్చు.

న్యూఇయర్ లో నూతన స్త్రీ పాత్ర : కుటుంబములో యజమాని పాత్ర ఎంత ప్రాముఖ్యమో దానికి ధీటుగా స్త్రీ పాత్ర కూడా ఉంటేనే ఆ కుటుంబము అన్ని విషయాలలో ఆశీర్వాదకరముగా వుంటుంది.

అవిధేయత గల స్త్రీ : బైబిల్‌నందు ఒక రాజు గారు 120 సంస్థానాలకు మంచి రాజుగా ఉన్నాడు. అతడు గొప్ప విందు చేయించి, ఆ విందులో తన భార్యను నాట్యమాడమని ఆజ్ఞాపించాడు. దానికి ఆమె తిరస్కరించింది. దానితో రాజుకు మరియు అధికారులందరికి కోపము వచ్చింది. రాజు ప్రధానులను పిలిచి ఈ స్త్రీ సంగతి ఏమని అడుగగా వారు ఇలా తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని ఇలాగే వదిలేస్తే రాణులందరు ఇకపై రాజులను ఎదిరించెదరు. స్త్రీలంత పురుషులను ఎదిరింతురు. పురుషుడంటే గౌరవము లేని దుస్థితి పుట్టుకొస్తుంది. అందుకే ఈ స్త్రీ స్థానములో మరొక స్త్రీని రాణిగా ఏర్పరచాలని తీర్మానించారు. ఆ తీర్మానం ప్రకారమే ఆ చుట్టుప్రక్కల అందమైన రాజకుమార్తెలను, యౌవ్వనరాండ్రల నందరిని రప్పించి ఒక సంవత్సరకాలము వారిని అలంకరించు కొనుటకు అవకాశమునిచ్చి వారిపై హేగే అనే నపుంసకుడిని అధికారిగా నియమించారు.

ఓ స్త్రీ ఆనాడు ఆమె 120 సంస్థానాలకు రాణిగా అవకాశం పొందితే, నేడు నీవు కూడా 2015 అనే సంవత్సరముపై అధిపతిగా రాణిగా లేక 2015ని ఏలే అవకాశాన్ని దేవుడు నీకిచ్చాడు. ఈ 2015 వ సం॥ అనే 365 రోజులను నీవు ఎంత చక్కగా అలవరచుకోవాలో తెలుసుకో? ఎలా అంటే, అనాథయైన ఎస్తేరు అప్పటి వరకు ఒక చిన్న గుడిసెలో ఉండి ఉండేది. ఇప్పుడు ఒక్కసారే రాజు గారి ఆ ఉన్నతమైన రాజకోటలోకి ప్రవేశించింది. గుడిసె నుంచి రాజకోటలోనికి వచ్చిన ఆమెకు అది అంతా క్రొత్తగానే ఉంది. అది 2015 సంవత్సరము కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. అయితే ఆమెకు దేవుడిచ్చిన రాణి స్థానాన్ని బహు చక్కగా వినియోగించుకొని, రాజుకి తగిన రాణిగా, భార్యగా, పరిస్థితులన్ని క్రొత్తయినప్పటికి కూడా దేవునియందు భయభక్తులు కల్గి జ్ఞానమును పొందుకొని సమస్తాన్ని చక్కగా అలవరచుకొని, ప్రపంచములోనే ఒక గొప్ప మాదిరి కల్గిన రాణిగా, నేటికి స్త్రీలందరికి గొప్ప మాదిరిని ఉంచిన గొప్ప వనితగా, సాక్షిగా మిగిలింది.

చదివిందంతా చాలా బాగుంది. ఇంతకి ఒక తల్లిగా, కుమార్తెగా, కోడలిగా, నీ మాదిరి ఎలా ఉంది? నీ జీవిత విధానం ఎలా ఉంది? మరి ముఖ్యముగా ఈ 2015 నూతన సంవత్సరాన్ని ఎలా ప్లానింగ్ చేసుకున్నావు? సంవత్సరాలు గతించిపోతుంటాయి. మరలా క్రొత్త సంవత్సరాలు వస్తుంటాయి. అలాగే పరిస్థితులు కూడా నూతనమవుతుంటాయి. అయితే అది నీవు అలవరచుకునే విధానాన్ని బట్టి ఉంటాయి. ఇదిగో పాతవి గతించెను - సమస్తమును క్రొత్తవాయెను.

న్యూఇయర్‌లో నూతన స్త్రీగా నీ ఆలోచనలు, అలవాట్లను, అలాగే నీవు చేసే ప్రతి పనిని కూడా నూతనముగా ఉండునట్లు మరి ముఖ్యముగా ప్రభువునకు ఇష్టమైనట్లు ఎస్తేరులా జీవించు. అప్పుడు నిన్ను బట్టి మొదట దేవుడు సంతోషిస్తాడు, ఆ తర్వాత నీ కుటుంబం, ఆపై నీ సంఘము మరియు నీ చుట్టు ప్రక్కల వారంతా సంతోషించి, ప్రభువుని మహిమపరుస్తారు. దేవుడు అట్టి కృపను మీకు అనుగ్రహించును గాక!. మొదట నా నీతిని రాజ్యమును వెదకుడి, అప్పుడు అవన్నియు (మీకు) అనుగ్రహించబడును. - ఎడిటర్

# లిటిల్ నాలెడ్జ్ ఫర్ కిడ్స్



## మత్తయి 2 13 - 23 వచనములు

1. హేరోదు రాజు ఎవరిని సంహరించాలని వెదుకుచున్నారు ?
2. ప్రభువు దూత స్వప్నమందు యోసేపునకు ప్రత్యక్షమై ఎక్కడికి వెళ్ళమన్నారు ?
3. ఎవరి గురించి హేరోదు ఆగ్రహము తెచ్చుకున్నారు ?
4. ఎన్ని సంవత్సరాల తక్కువ వయస్సు గల మగ పిల్లలనందరిని వధించెను ?
5. ఎవరు చనిపోయిన తరువాత ప్రభువు దూత ఐగుప్తులో స్వప్నమందు ప్రత్యక్షమైంది ?
6. ప్రభువు దూత యోసేపుకు ఎన్నిసార్లు ప్రత్యక్షమైంది ?
7. హేరోదు తరువాత ఎవరు ఏలుబడి చేశారు ?
8. రెండవ సారి ప్రభువు దూత ప్రత్యక్షమై ఎక్కడికి వెళ్ళమంది ?
9. వారు ఏ ఊరిలో కాపురముండిరి ?
10. ఏ ప్రవక్త ద్వారా చెప్పబడిన మాట నెరవేర్చబడింది ?


### మత్తయి గత సంచిక జవాబులు

1. - మత్తయి 2 :13
2. - మత్తయి 2 :13
3. - మత్తయి 2 :16
4. - మత్తయి 2 :16
5. - మత్తయి 2 :19
6. - 2 సార్లు
7. - మత్తయి 2 :22
8. - మత్తయి 2 :20
9. - మత్తయి 2 :23
10. - మత్తయి 2 :18

## ప్రతి నెల ఒక్కో అపోస్తలుల చరిత్ర ! చదివి ఆనందించండి

# తోమా

గత సంచిక తరువాయి...



పరి.తోమా ను ''దిదుము'' అని కూడా అంటారు. అంటే ''కవలలు'' అని అర్థము. ఇతనితో జన్మించిన సోదరి లేక సోదరుని వివరములు లేవుగాని, ఇతడు గలిలయ ప్రాంతపు జాలరి అని చెప్పగలము. మొదటినుండి ఇతడు అనుమానస్థుడు లేక ఎక్కువగా ప్రశ్నించేవాడు. అందుకని ఇతనిని ''అనుమానాల తోమా'' అంటారు. యేసుప్రభువును నిష్కల్మషంగా ప్రేమించాడు. ఇతనిని గూర్చి యోహాను సువార్తలో ఎక్కువగా ఉంది. మత్తయి సువార్తలో ఇతని అపోస్తలత్వమును గూర్చి వ్రాసి వుంది. మత్తయి 10:3; మార్కు 3:18; లూకా 6:15; అపో.కా॥ 1:13.

యోహాను సువార్తలో లాజరు ప్రాంతమయిన బేతనియకు వెళ్ళటానికి ఇతర శిష్యులు ఆ ప్రాంతంలో ప్రభువుపై వ్యతిరేకతను బట్టి అనుమానించినప్పుడు తోమా శిష్యులతో ''మనము ప్రభువుతో గూడా చనిపోవుదము రండు'' అని వారికి ధైర్యము చెప్పి అక్కడకు వెళ్ళాడు యోహాను 11:16. ఇది తోమా ధైర్యమునకు , తెగింపుకు మంచి ఉదాహరణ, యోహాను14:5 ప్రకారము. అందుకు తోమా ''ప్రభువా యెక్కడికి వెళ్ళుచున్నావో మాకు తెలియదే, ఆ మార్గము ఎలాగు తెలియునని ఆయనను అడుగగా'' ఈ విధముగా తోమా తన సందేహములను ప్రభువును అడిగి తెలుసుకొనే తత్వముగల వ్యక్తి.

పునరుత్థాన సమయములో తోమా లేడు. ఆ తరువాత శిష్యుల మాటలతో ఏకీభవించలేదు. ''శిష్యులు మేము ప్రభువును చూచితిమి అని అతనితో అన్నప్పుడు ''నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వ్రేలు ఆయన మేకుల గురుతలలో, నా చేయి ఆయన ప్రక్కలో ఉంచితేగాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను''. యోహాను 20:25.

ఎనిమిది దినముల తరువాత, ప్రభువు అపోస్తలుడు తోమాతో సహా అందరు ఉన్న సమయములో ఆశ్చర్యకరముగా వారి మధ్యకు వచ్చి నిలబడ్డాడు, ప్రభువు తోమాను పిలిచి ''రమ్ము నా గాయములను పరీక్షించుమని చెప్పెను.'' అందుకు తోమా ''నా ప్రభువా నా దేవా'' అని ఆరాధించాడు. ప్రభువు తోమాను అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుమని చెప్పాడు. మరియు తోమాతో నీవు చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులు అని చెప్పాడు. యోహాను 20:24-29.

యోహాను, తోమా ఒకే పట్టణవాసులు. వత్తికి జాలరులు. బాల్యమునుండి వారు స్నేహితులు. యేసుప్రభువు తిబెరియ సముద్ర తీరములో శిష్యులను పిలిచినప్పుడు తోమా కూడా ప్రభుచే పిలువబడిన శిష్యుడు. యోహాను తన సువార్తలో అందువలననే తోమాను గూర్చి వివరంగా వ్రాసాడు.

తోమా అనుమానస్తుడే గాని మరి ఎటువంటి మానసిక ఆందోళన కలిగినవాడు కాదు. అందువల్లనే ఇతడు నిష్కళంకమైన విశ్వాసిగా పేరుపొందాడు.

తోమా పరిచర్య, కార్యక్రమాల వివరణ :

పేతురు తరువాత వాస్తవిక అపోస్తలునిగా తోమాను చెప్పవచ్చు. తన పరిచర్యలో థామస్ బబులోనును దర్శించాడు. పశ్చిమ ప్రాంత క్రైస్తవత్వ ప్రచారము కన్నా తూర్పు ప్రాంత క్రైస్తవ అపోస్తలుల ఉద్యమాలకు తోమా మూలకారకుడు. ఆ దినాలలో క్రైస్తవ్యము పశ్చిమం కన్నా తూర్పు ప్రాంతాలలోనే అధికముగా అభివృద్ధి చెందింది. వీటన్నిటికి ఆ కాలమునాటి క్రైస్తవ ఉద్యమాలు, వాటి ప్రాముఖ్యత, పశ్చిమ ప్రాంత దేవాలయాల వృద్ధి, రోమా, కాన్‌స్టాంట్‌నోపిల్ చుట్టూ జరిగిన చరిత్ర సంఘటనలు, అప్పటి వ్రాతలు, వాటి వివరణ మనకు వాస్తవిక ఆధారములు.

తూర్పు ప్రాంతము దేవాలయాల సాంప్రదాయములు :

ఆ కాలములో తూర్పుప్రాంతములో క్రైస్తవత్వం అపోస్తలుల ద్వారా, కథోలిక్కుల దేవాలయముల ప్రచురణల ద్వారా క్రైస్తవత్వము విస్తరించింది. ఈ ప్రమేయములో క్రైస్తవత్వ పరిచర్య తొలి అధిపతులుగా పేతురు, థామస్, తద్దయి, మేరి (70 మందిలో ఒకరు) ని చెప్పవచ్చు. వీరు అనేక దేవాలయములకు మూల పురుషులు. క్రైస్తవ్యమును స్థాపించిన అపోస్తలులు క్రైస్తవత్వ పురోభివృద్ధి, మొదటి శతాబ్దంలో దేవాలయము వరకు పరిమితమై యుండెడి. ఆ దేవాలయము ఒక బిషప్పు, లేక ''పెద్ద'' అనే వ్యక్తితో నడిపించబడేది. దేవాలయ కార్యక్రమాలు అన్నీ ఇతడే నిర్వహించేవాడు. ఆ విధముగా ప్రతి ప్రాంతమునకు ఒక ''పెద్ద'' లేక బిషప్పు ఉండేవాడు.

తూర్పు ప్రాంతపు దేవాలయ సముదాయమంత ప్రభువు శిష్యులకు మాత్రమే పరిమితము. అందులో ఒక దేవాలయము బెత్లెహేము నుండి తిరిగి వచ్చిన తరువాత ''రెసాయె'' అంటే ఉత్తర ఇరాన్ దేశములో కట్టబడింది. ఆ పీఠాధిపతి చిన్నతనములోనే నియమించబడ్డాడు. ఈ పీఠాధిపతి తోమాను గూర్చి వ్రాసాడు. దేవునిచేత నడిపింపబడి తోమా, మధ్య తూర్పు ప్రాంతాలలో దేవాలయములను ప్రతిష్టించాడు. తగిన యాజకులను పరిచర్యలో అనేక వేలమంది యేసుప్రభువును నమ్మి, విశ్వసించి, మారుమనస్సు పొందారు. వీరికి తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలో బాప్తీస్మము నిచ్చాడు. కొందరిని ప్రత్యేకముగా అభిషేకించాడు. వారందరికి ప్రార్థన చేసుకోటానికి దేవాలయములను కట్టించాడు. వారి ఆత్మీయ ఎదుగుదలకు కావలసినవన్నీ సమకూర్చాడు. ఈ ప్రక్రియలో తోమా అనేక కష్టాలను, సమస్యలను ఎదుర్కొన్నాడు. చివరికి రాజైన ''మిజడిచె'' తోమాను గుర్రములచే త్రొక్కించాడు. ఈ విధంగా హతసాక్షి మరణమును పొందాడు.

తోమా, 1900 సంవత్సరాల క్రితము బబులోనులో క్రైస్తవులకు ఒక దేవాలయము కట్టించి ఆ తరువాత దైవ ప్రేరణతో హిందూదేశమునకు పరిచర్య నిమిత్తము వచ్చాడు. ఇతని సువార్త మంచి నేలను పడిన విత్తనమువలె విస్తరించింది. ఆసియా ప్రాంతమంతా ఫలించింది. చరిత్ర గడిచేకొద్దీ ఈ దేవాలయ కీర్తి తగ్గటం ప్రారంభించింది. అయిననూ ఇప్పటికీ పరిశుద్ధుల జ్ఞాపకాలు నిలిచిపోయాయి. ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరి ఈ బబులోను దేవాలయం చూచాడు.

...... తరువాయి భాగం వచ్చే సంచికలో .....

**కుటుంబాన్ని కట్టేది స్త్రీయే - కుటుంబాన్ని కూల్చేది స్త్రీయే - రెండింటిలో ఏది నీ పాత్ర?**

# 'యూ'త్ ఫైర్ YOUTH FIRE

## అంధత్వానికి అందమైన నిర్వచనాన్ని ప్రపంచానికి అందించిన హెలెన్ కెల్లర్

ప్రపంచ ప్రముఖులు మొదలు సాధారణ మేధావుల వరకు తమ వ్యక్తిగత లైబ్రరీలలో దాచుకొనే పుస్తకం "The Story of my Life" నుండి క్లుప్తంగా విషయాలను ఏరికూర్చి ప్రచురిస్తున్నాం. "సాధారణ మనుష్యులు కలలో కూడా ఊహింపశక్యంగాని దౌర్భాగ్యమైన జీవితాన్ని గడిపి, చివరకు ప్రపంచ మేధావుల నీరాజనాలందుకొన్న హెలెన్ కెల్లర్ జీవితం మనందరకు ముఖ్యంగా తమకున్న కష్టాలను భూతద్దంలో చూచుకొని బెంబేలెత్తిపోయి ఎందుకూ పనికిరాని వైరాగ్యాన్ని మాట్లాడుతూ తమ కష్టాలకు సమాప్తి ఈలోకంలో లేదు అని నిర్ధారణకొచ్చే నేటి యువతరానికి ఆమె జీవితం కనువిప్పు కాగలదు" అని ఎన్నో సమయాలల్లో ఎందరో ప్రముఖులు ఉద్ఘాటించడం కెల్లెర్ తన జీవితంలో అనుభవించిన నరకయాతనకు నిదర్శనం. దీని ద్వారా స్ఫూర్తి పొంది కొందరైనా తమ "మనస్సాక్షి"కి పని పెడతారని ప్రచురిస్తున్నాము.

అంధురాలు, చెవిటిదీ అయిన ఆ పుస్తక రచయిత్రి కెల్లెర్ గురించి పబ్లిషర్స్ వ్రాసింది వెనుక పేజీలో వున్నది. మొదటి పేజీలో ప్రారంభ వాక్యాలుగా ఒక పేరాగ్రాఫ్ వుంది.

"మీరెప్పుడైనా దట్టమైన మంచులో సముద్రాన్ని చూసారా? ఒక 'తెల్లటి' చీకటి మీ చుట్టూ కప్పేసినట్లు వుంటుంది. అలాంటి అస్పష్టమైన అయోమయం లోంచి ఒక ఓడ, ఒడ్డుకి రావటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. అటువంటి ఓడ తెచ్చే కబురు కోసం తీరాన నిలబడి ఎదురు చూస్తున్నదానిలా, నా చదువు ప్రారంభానికి ముందు వేచివున్నాను...'

1880 లో పుట్టిన హెలెన్ కెల్లర్ పద్దెనిమిది నెలల వరకూ అందరు పిలల్లగే వుండేది. నడవటం, మాట్లాడటం, ఆసక్తి వగైరా అంతా మామూలే. కానీ ఆ అందమైన బాల్యం తాలూకు కల క్రమక్రమంగా అస్పష్టమైంది. ఒక సంతోషం, శూన్యంలోకి ప్రయాణం చేసింది.

**"ఒక వర్షర్తువులోని చినుకు - అందమంతా కలిసి - గ్రీష్మకాలపు వేసవికి, మాడిపోయినట్టు, ఒక పర్జన్య ఘోష నా చెవుల్నీ ఒక సుడిగాలి దుమ్ము నా కళ్ళనీ కమ్మేసింది. క్రమక్రమంగా నా కనుల ముందు నుంచి వెలుగూ, నా చెవుల నుంచి శబ్ధమూ దూరమైపోయాయి."** ఏడాదిన్నర వయసులో వచ్చిన విషజ్వరం ఆ పాప చూపునీ, వినికిడినీ దూరం చేసింది. ఆమె ఆ రోజుల్ని తిరిగి గుర్తుచేసుకుంటూ వుంటుంది.

**"ఒక అర్థరాత్రి మెలకువ వచ్చింది. కనుల ముందు దృశ్యాలు అస్పష్టంగా కనపడసాగాయి. నాకేమీ అర్థం కాలేదు. రోజులు గుడుస్తున్న కొద్దీ... చీకటితో స్నేహం పెరిగేకొద్దీ.. నాకు వాస్తవం అర్థమవసాగింది. నేను చెవిటిదాన్ని, మూగదాన్ని, గ్రుడ్డిదానను అయిపోయానని..."**

నిజానికి, చెవుడు, మూగ అన్న రెండు పదాలు వుంటాయని ఆ చిన్న వయసులో ఆమెకి తెలీదు. ఆ విధంగా అయిదు సంవత్సరాలు గడిచాయి. సంజ్ఞలతోనే జీవితం గడచిపోతుంది. తన చుట్టూ వున్నవారు దాహం వేసినా, ఆకలేసినా తనలా చేతివేళ్ళ ఉపయోగించరనీ, నోటినీ, శబ్ధాన్నీ ఉపయోగిస్తారనీ, వాటిని మాటలంటారనీ ఆమెకి క్రమంగా అర్థమైంది. మనుష్యులు 'శబ్ధం' చేయవచ్చని తెలుసుకుంది. అయితే 'శబ్ధం' అంటే మాత్రం ఏమిటో తెలీదు.

**"సంభాషిస్తోన్న ఇద్దరు మనుష్యుల మధ్య నిలబడి వారి పెదవుల్ని వేళ్ళతో స్పర్శించినప్పుడు, అవి కదలటాన్ని గ్రహించాను. నా చాలా చాలా చిన్నప్పటి గతం మసక మసగ్గా గుర్తొచ్చింది. కానీ వారి పెదాలు ఏ శబ్ధాన్ని బహిర్గతం చేస్తున్నాయో తెలియలేదు. నేను కూడా అదే విధంగా శబ్దాన్ని (?) సృష్టించటానికి ప్రయత్నం చేసాను. ఫెయిల్ అయ్యాను. నా ఓటముల విస్ఫోటనాలు నాకు చాలా వేదన కలిగించేవి. ఒక అదృశ్య శక్తి నన్ను రెండు కబంధ హస్తాల మధ్య నలిపివేస్తున్నట్లు, అందులోంచి స్వేఛ్ఛ పొందటానికి నేను గింజుకుంటున్నట్లు అనుభూతి కలిగేది."**

హెలెన్ కెల్లర్ ఆరో ఏట, ఆమె తల్లిదండ్రులు హెన్నె సల్లివాన్ అనే ఆమెని తమ కూతురుకి సంరక్షకురాలిగా నియమించారు. రెండ్రోజులు తరువాత ఆమె, కెల్లర్ చేతిలో ఒక బొమ్మ వుంచి, చేతి వేళ్ళని D-O-L-L గా అమర్చి ఆ చిన్న పాపతో సంభాషించటానికి ప్రయత్నించింది. ఆ విధంగా మొట్టమొదటిసారి ఆ పాపకీ ప్రపంచానికీ మధ్య ఒక సంబంధం ఏర్పడటానికి మొదటి విత్తనం చల్లబడింది. ఇదంత చిన్న విషయమేమీ కాదు. ఈ లోకంలో చెవిటి, మూగ వుంటారు. వారు చూడగలరు. లేదా గుడ్డి వారుంటారు. వారు వినగలరు. కానీ గుడ్డి, చెవుడు వున్నవారు ప్రపంచంతో ఏ విధంగా సంబంధం ఏర్పరచుకోగలరు? చెవి, కన్ను లేకపోతే అసలు కమ్యూనికేషన్‌కి దారి ఎక్కడుంది? జ్ఞానం ప్రవేశించాలంటే ఒక మార్గం వుండాలి కదా! నోరు, ముక్కు జ్ఞానాన్ని గ్రహించలేవు. పంచ జ్ఞానేంద్రియాల్లో మిగిలింది ఒక్కటే చర్మం.

అవును చర్మం! దానితో ఎందుకు ప్రయత్నించకూడదు?

ఆ విధంగా, తన చేతిలో వున్న మెత్తటి పదార్థాన్ని స్పృశిస్తూ, నాలుగుసార్లు వేళ్ళు తిప్పటం ద్వారా బొమ్మని D-O-L-L అని మనుష్యులు 'పిలుస్తారని' (?) ఆ పాప తొలిసారి గ్రహించింది. చర్మం ద్వారా ప్రపంచాన్ని చూడటానికి ఒక ఆరేళ్ళ పాప చేస్తున్న అద్భుత ప్రయోగానికి తొలి ప్రయత్నం అది!.

ఆ తరువాత కెల్లర్‌ని ఒక నీటిపంపు దగ్గరకు తీసుకు వెళ్ళింది హెన్నె సల్లివాన్ 'ఆమె టీచర్ గైడ్ ఫిలాసఫర్'. చేయి సాచమని చెప్పి నీటిని వదలింది. మరో అరచెయ్యి మీద **Water** అని వ్రాసింది.

**"ఆ క్షణం నా మనసు చుట్టూ వున్న మిస్టరీ విడిపోతున్నట్లు అనిపించింది. ఒక లాంగ్వేజి, ఒక కమ్యూనికేషన్ మిస్టరీ, మనిషికీ మనిషికీ మధ్య వుండే సంబంధాల్నీ బంధుత్వాల్నీ కలిపే వివిధ వస్తువులూ, వాటికి మనుష్యులు పెట్టుకునే పే..ర్లూ.. ఎక్కడో పారేసుకున్న ఒక జ్ఞాపకం, స్మృతి పుటల్లోంచి పునర్జీవనం పొంది తిరిగి వచ్చిన అనుభూతి కలిగింది. Water అంటే నా చేతి మీదికి చల్లగా జారుతున్న అద్భుతమైన 'ఏదో'..."**

కెల్లెర్ ఆ తరువాత చేతుల్తో స్పృశించి, పరిమళాన్ని గ్రహించి ప్రపంచాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. అడవుల మధ్య చెట్లు, మట్టి వాసన, ప్రతి వస్తువుకీ ఒక అస్థిత్వం, ప్రతి వస్తువుకీ ఒక పేరూ వుంటాయని గ్రహించింది. చేతివేళ్ళ భంగిములు మార్చటం ద్వారా, ఒక్కొక్క నామవాచకానికీ ఒక్కోపేరు ఆపాదించటంలో అమితమైన ఆనందాన్ని ఆస్వాదించసాగింది. అదొక అపురూపమైన అనుభవం. చిన్న పిల్లలు ఎంతో సులభంగా, మామూలుగా చూసీ, వినీ, పెద్దల్నుంచి తెలుసుకొని గ్రహించగలిగే సాధారణ విషయాన్ని కూడా ఎంతో కష్టపడి, అంతర్ చక్షువుతో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. వస్తువుల సంగతి సరే. విభక్తుల సంగతి? విశ్లేషణాల సంగతి? సంధుల సంగతి? సమాసాల సంగతి? భావోద్వేగాలూ, స్పందనలు, అనుస్పందనలు, ప్రకృతి వర్ణనలూ... అంతే కాదు. రెండు వేర్వేరు అర్థాలనిచ్చే పదాల్ని కలిపే లింకులూ... అన్నిటినీ టీచర్ నేర్పింది. ఒక విదేశీయుడు, తర్జుమాదారు సహాయంతో తెలియని దేశంలో తిరుగాడినట్టు, ఈ మానవ ప్రపంచమనే పరాయి దేశాన్ని ఆమె 'తన' భాషలోకి అనువాదం చేసుకుంది. 1887 క్రిస్టమస్ రోజున, అప్పటివరకూ 'శెలవు దినం' అంటే ఏమిటో తెలియని హెలెన్ కెల్లెర్ తన కుటుంబాన్ని జీవితంలో మొట్టమొదటిసారి 'మెర్రీ క్రిస్టమస్' సంజ్ఞతో నిద్రలేపగలిగినది. అది అపూర్వమైన రోజు.

ఆ తరువాత ఎనిమిదేళ్ళ వయసులో తన మొట్టమొదటి చరిత్ర పాఠాన్ని 'చేతి సంజ్ఞలతో చెవిటి, గుడ్డి అమ్మాయి దవడ, పెదవులు, నాలుక పొజిషన్‌ని స్పృశిస్తూ, తను కూడా అలాంటి శబ్ధాన్ని బహిర్గత పర్చటానికి ప్రయత్నించింది. ఒక మంచు శిఖరం మీద నుంచి అవలాంచీ జారినట్లు ఆమె స్వరం నుంచి మొదటిసారిగా బయటకు వచ్చిన వాక్యం - "ఇక్కడ వేడిగా వుంది కదూ" **"అదొక అనిర్వచనీయ అనుభవం. నా ప్రపంచాన్ని నేను గెలిచిన అనుభూతి, నాకు నా మాటలు వినపడలేదు. తాము మాట్లాడే మాటలు మనుష్యులకి వినపడతాయో లేదో నాకు తెలీదు. కానీ నా మాటలు అవతలి వారికి వినపడుతున్నాయని, దానికి గుర్తుగా నా భూజాల మీద అభినందన పూర్వక చేతి స్పర్శ తట్టినప్పుడు, నా చేతివేళ్ళ పని తగ్గిపోయిందన్న ఆనందం అపూర్వం".**

1894లో హెలెన్ కెల్లర్ కల నిజమైంది. కేమ్‌బ్రిడ్జ్ స్కూల్లో చెవిటి వారి కోసం స్థాపించబడిన క్లాసులో చదివి, ఆ తరువాత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ యూనివర్సిటీ కాలేజీలో ప్రొఫెసర్ పాఠం చెబుతూ వుండగా, ప్రక్కన కూర్చున్న సల్లివాన్ 'తమ' భాషతో ఆ పాఠాన్ని అనువదిస్తుండగా, లెక్కలు, చరిత్ర, ఫిజిక్స్, జర్మన్ నేర్చుకుంది. ఆమె పరీక్ష పేపర్లు దిద్దటానికి (?) కష్టపడే ఎగ్జామినర్లు అభ్యంతరపెట్టారు. తెలియని విమర్శకులు 'ఇదంతా నాటకం' అని కొట్టిపడేసారు. అన్ని కష్టాల్నీ అధిగమించి ఆమె చదువు పూర్తి చేసింది.

1902లో ఆమె నవల విడుదల అయింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కాపీలు అమ్ముడుపోయాయి. ఆమె గుడ్డిదనీ, చెవిటిదనీ సానుభూతితో ఎవరూ పుస్తకాన్ని చదువలేదు. ఒక ప్రపంచాన్ని వేరే దృష్టితో ఎలా చూడవచ్చో, కనులూ, చెవులూ వున్నవారి కన్నా అందంగా ఈ లోకాన్ని ఎలా దర్శించవచ్చో, ఆహ్లాదంగా చిత్రీకరించబడిన పుస్తకం అది. ఆ తరువాత ఆమెకు పెద్ద పెద్ద రచయితల, సైంటిస్టులతో చర్చించే వీలు కలిగింది. అలెగ్జాండర్ గ్రాహమ్ బెల్, కవి జాన్‌గ్రీన్ లీఫ్ లాటి వారితో పరిచయం అయింది.

పద్దెనిమిది నెలల బాల్యపు వయసులో కమ్మిన చీకటి నుంచి ఆమె ఆ విధంగా బయటకి రాగలిగింది. 'నా జీవిత గాథ' పుస్తకంలో కొన్ని వాక్యాలు ఈ విధంగా వుంటాయి.


"నిద్రకు మెలకువకూ తేడా తెలియని స్థితిలో... నా చుట్టూ ప్రపంచం ఇంకా శయనిస్తోందో.. లేచి హడావుడి పడుతోందో గుర్తించలేని అనుభూతి రాహిత్యంతో నేను మేల్కొంటాను. ఒక్కొక్కసారి భరించలేనంత ఒంటరితనం నన్ను వెలుగు నుంచీ, సంగీతం నుంచీ, ఆనందం నుంచీ దూరంగా లాక్కెళ్ళి ఒంటరిదాన్ని చేసి తన రక్కసి కౌగిలిలో బంధిస్తుంది.

అప్పుడు నేను, ఇతరుల కళ్ళల్లో కనపడే వెలుగునీ, వారి చెవుల్లో ప్రకృతి వినిపించే సంగీతాన్ని, వారి పెదవులపై కదలాడే చిరునవ్వునీ నా స్వంతం చేసుకుంటాను..."

హెలెన్ కెల్లర్ మంచి భక్తిశ్రద్ధలు గల క్రైస్తవురాలు కావటం విశేషం. "ఏవో కొన్ని లోపాలు దేవుడు నాకు పెట్టినా అంతకు పదింతల జ్ఞానాన్ని నాలో కలిగించినా యేసయ్యకు నేను ఋణస్తురాలను".. ఇవి చివరగా ఆమె చనిపోతున్న సమయంలో హెలెన్ కెల్లర్ తన వ్యక్తిగత డైరీలో వ్రాసుకున్న చివరి మాటలు.

............ oooo .............

## బైబిల్ బ్రెయిన్



### యేసుక్రీస్తు దీనత్వమునకు గల 9 ఉదాహరణలు

1. ఆయన పరలోక మహిమను విడచిపెట్టెను. - యోహాను 17:5; 2 కొరింథి॥ 8:9
2. ఆయన తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. - ఫిలిప్పీ॥ 2:7
3. ఆయన తన సర్వాంతర్యామిత్వమునుండి కొంతకాలముపాటు వైదొలగెను. - యోహాను 11:14,15
4. ఆయన తన సర్వజ్ఞత్వమునుండి కొంతకాలముపాటు వైదొలగెను - మార్కు 13:32; లూకా 8:45,46
5. ఆయన తన సర్వతోముఖశక్తిత్వము నుండి కొంతకాలముపాటు వైదొలగెను - యోహాను 5:19,20
6. ఆయన మానవుని స్వరూపము ధరించెను - యోహాను1:14; రోమా 1:3; గలతీ॥4:4; హెబ్రీ॥2:14,17,18
7. ఆయన తండ్రి అధికారమునకు లోబడి, ఎన్నో విధములుగా తన్నుతాను తగ్గించుకొనెను - 1 పేతురు 2:21-24
8. ఆయన మరణమువరకు విధేయత కలిగియుండెను. - మత్తయి 26:39;యోహాను 10:18; హెబ్రీ॥ 5:8; 12:2
9. ఆయన సిలువపై మరణించెను - కీర్తనలు 22; యెషయా 53; గలతీ॥ 3:13,14

## అంత్యదినములను గూర్చిన ప్రవచనములు

8. ప్రపంచ మత, రాజకీయ మరియు ఆర్థిక పద్ధతులలో ఏకీకరణ - ప్రకటన 13:4-8; 16,17; 17:1-18; 18:1-24
9. రాజ్యముల మరియు జాతులపై సరైన నాయకత్వము లేకపోవుటచే అంత్యక్రీస్తు వీరిపై సులభముగా అధికారమును చేజిక్కించుకొనును
10. విశ్వవ్యాప్తముగా మత్తు పదార్థాల వాడకము. ("మాయమంత్రములు" అను పదమును "మత్తు పదార్థాలు" గా కూడా ఇచ్చుట పరిగణించవచ్చును) - ప్రకటన 9:21
11. విచ్చలవిడి లైంగిక కార్యకలాపాలు - రోమా 1:17-32; 2 పేతురు 2:10,14; 3:3; యూదా 18
12. తల్లిదండ్రులు అనురాగము, జాలి, దయ లేకుండ అమాయకులైన గర్భస్థ శిశువులను జన్మించకమునుపే చంపి వేయుదురు. (గర్భస్రావము కలిగించుట) - రోమా 1:31; 2 తిమోతి 3:3
13. భయంకరమైన హింసాకాండ ప్రబలును - ఆది॥ 6:11,13; ప్రకటన 9:21

..... తరువాయి భాగం వచ్చే సంచికలో...

బుద్ధి, జ్ఞానములు యెహోవా యందు గుప్తములైయున్నవి. అవి అడిగి పొందుకొని చదువులో విజయాన్ని పొందు.

# యేసుప్రభువు సిలువ మరణ ప్రవచనాలు - వాటి నెరవేర్పు

... 1 వ పేజి తరువాయి భాగం ...

**✦ ఇస్కరియోతు యూదా ఉద్యోగం వేరొకరికి ఇవ్వబడుట :**

**ప్రవచనం :** వాని జీవిత దినములు కొద్దివగును గాక, వాని ఉద్యోగము వేరొకడు తీసికొనును గాక. **-కీర్తన 109:8.**

**నెరవేర్పు :** అప్పుడు వారు యూస్తు అను మారు పేరుగల బర్సబ్బా అనబడిన యోసేపు, మత్తీయ అను ఇద్దరిని నిలువబెట్టి ఇట్లని ప్రార్థన చేసిరి - అందరి హృదయములను ఎరిగియున్న ప్రభువా, తన చోటికి పోవుటకు యూదా తప్పిపోయి పోగొట్టుకొనిన యీ పరిచర్యలోను అపొస్తలత్వములోను పాలుపొందుటకు వీరిద్దరిలో నీవు ఏర్పరచుకొనిన వానిని కనబరచుమనిరి. అంతట వారు వీరినిగూర్చి చీట్లువేయగా మత్తీయ పేరట చీటి వచ్చెను గనుక అతడు పదునొకండుమంది అపొస్తలులతో కూడ లెక్కింపబడెను. **-అపో.కా॥ 1:23-26.**

**✦ ప్రభువు దిక్కులేనివాడగుట :**

**ప్రవచనం :** మేలునకు ప్రతిగా నాకు కీడు చేయుచున్నారు, నేను దిక్కులేనివాడనైతిని. **-కీర్తన 35:12.**

**నెరవేర్పు :** వారు ఆయన మీద పడి ఆయనను పట్టుకొనిరి... అప్పుడు వారందరు ఆయనను విడిచి పారిపోయిరి. **-మార్కు 14:46,50.**

**✦ ప్రభువు స్నేహితులు ఆయనను విడిచి వెళ్ళుట :**

**ప్రవచనం :** నా స్నేహితులును, నా చెలికాండ్రును నా తెగులు చూచి యెడముగా నిలుచుచున్నారు. నా బంధువులు దూరముగా నిలుచుచున్నారు. **-కీర్తన 38:11.**

**నెరవేర్పు :** ఖడ్గమా, నా గొఱ్ఱెలకాపరిమీదను నా సహకారి మీదను పడుము; ఇదే సైన్యములకధిపతియగు యెహోవా వాక్కు - గొఱ్ఱెల చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము, చిన్నవారిమీద నేను నా హస్తము నుంచుదును; ఇదే యెహోవా వాక్కు. **-జెకర్యా 13:7.**

**✦ ప్రభువు సహోదరులు ఆయనను తృణీకరించుట :**

**ప్రవచనం :** నా సహోదరులకు నేను అన్యుడనైతిని, నా తల్లి కుమారులకు పరుడనైతిని. **-కీర్తన 69:8.**

**నెరవేర్పు :** ఆయన ఇంటివారు సంగతి విని, ఆయన మతి చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి. **-మార్కు 3:21.**

యూదా పర్ణశాలల పండుగ సమీపించెను గనుక ఆయన సహోదరులు ఆయనను చూచి - నీవు చేయుచున్న క్రియలు నీ శిష్యులును చూచునట్లు ఈ స్థలము విడిచి యూదయకు వెళ్లుము. బహిరంగమున అంగీకరింపబడ గోరువాడెవడును తన పని రహస్యమున జరిగింపడు. నీవు ఈ కార్యములు చేయుచున్నయెడల నిన్ను నీవే లోకమునకు కనబరచుకొనుమని చెప్పిరి. ఆయన సహోదరులైనను ఆయనయందు విశ్వాసముంచలేదు. **-యోహాను 7:2-5.**

**✦ ప్రభువునకు విరోధముగా అబద్ధసాక్షులు :**

**ప్రవచనం :** నన్ను చెరపవలెనని భక్తిహీనులు తమ నోరు కపటముగల తమ నోరు తెరచియున్నారు వారు నామీద అబద్ధములు చెప్పుకొనుచున్నారు నన్ను చుట్టుకొని నా మీద ద్వేషపు మాటలాడుచున్నారు, నిర్నిమిత్తముగా నాతో పోరాడుచున్నారు. **- కీర్తన 109:2,3.**

**నెరవేర్పు :** ప్రధానయాజకులును మహాసభవారందరును, యేసును చంపవలెనని ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదకుచుండిరి కాని అబద్ధసాక్షులనేకులు వచ్చి నను సాక్ష్యమేమియు దొరకలేదు. **-మత్తయి 26:59,60.**

**✦ ప్రభువుపై చేయని నేరాలు మోపుట :**

**ప్రవచనం :** కూటసాక్షులు లేచుచున్నారు, నేనెరుగని సంగతులను గూర్చి నన్ను అడుగుచున్నారు. **-కీర్తన 35:11.**

**నెరవేర్పు :** అంతట వారందరును లేచి ఆయనను పిలాతునొద్దకు తీసికొనిపోయి - ఇతడు మా జనమును తిరుగబడ ప్రేరేపించుచు, కైసరునకు పన్నియ్యవద్దనియు, తానే క్రీస్తును ఒక రాజుననియు చెప్పగా మేము వింటి మని ఆయనమీద నేరము మోపసాగిరి. **-లూకా 23:1,2.**

**✦ ప్రభువు శత్రువుల యెదుట మౌనముగా నుండుట :**

**ప్రవచనం :** చెవిటివాడనైనట్టు నేను వినకయున్నాను, మూగవాడనైనట్టు నోరు తెరుచుట మానితిని. నేను వినలేనివాడనైతిని, ఎదురుమాట పలుకలేనివాడనైతిని. **-కీర్తన 38:13,14.**

అతడు దౌర్జన్యము నొందెను, బాధింపబడినను అతడు నోరు తెరువలేదు వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు. **-యెషయా 53:7.**

**నెరవేర్పు :** ప్రధాన యాజకులును పెద్దలును ఆయనమీద నేరము మోపినప్పుడు ఆయన ప్రత్యుత్తరమేమియు ఇయ్యలేదు. కాబట్టి పిలాతు - నీమీద వీరెన్ని నేరములు మోపుచున్నారో నీవు వినలేదా? అని ఆయనను అడిగెను. అయితే ఆయన ఒక్క మాటకైనను అతనికి ఉత్తరమియ్యలేదు గనుక అధిపతి మిక్కిలి ఆశ్చర్యపడెను. **-మత్తయి 27:12-14.**

**✦ ప్రభువును అనేకులు చంపగోరుట :**

**ప్రవచనం :** నిర్నిమిత్తముగా నామీద పగపట్టువారు, నా తలవెంట్రుకల కంటె విస్తారముగా ఉన్నారు, అబద్ధమునుబట్టి నాకు శత్రువులై నన్ను సంహరింపగోరువారు అనేకులు, నేను దోచుకొనని దానిని నేను ఇచ్చుకొనవలసి వచ్చెను. **-కీర్తన 69:4.**

**నెరవేర్పు :** హేరోదు అతని మా యొద్దకు తిరిగి పంపెను గదా; ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు. కాబట్టి నేనితనిని శిక్షించి విడుదల చేయుదునని వారితో చెప్పగా వారందరు - వీనిని చంపివేసి మాకు బరబ్బను విడుదల చేయుమని ఏకగ్రీవముగా కేకలువేసిరి. అయితే వారొకేపట్టుగా పెద్దకేకలువేసి, వీనిని సిలువ వేయుమని అడుగగా వారి కేకలే గెలిచెను. **-లూకా 23:15-18,23.**

**✦ ప్రభువు అవమానించబడుట :**

**ప్రవచనం :** కొట్టువారికి నా వీపును అప్పగించితిని, వెంట్రుకలు పెరికివేయువారికి నా చెంపలను అప్పగించితిని, ఉమ్మివేయు వారికిని అవమానపరచు వారికిని నా ముఖము దాచుకొనలేదు. **-యెషయా 50:6.**

**నెరవేర్పు :** అప్పుడు వారు ఆయన ముఖము మీద ఉమ్మివేసి, ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి - క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడో ప్రవచింపుమనిరి. **-మత్తయి 26:67,68.**

కొందరు ఆయనమీద ఉమ్మివేసి ఆయన ముఖమునకు ముసుకువేసి, ఆయనను గుద్దుచు - ప్రవచింపుమని ఆయనతో చెప్పసాగిరి. బంట్రౌతులును ఆయనను అరచేతులతో కొట్టి పట్టుకొనిరి. **-మార్కు 14:65.**

అంతట సైనికులు ఆయనను ప్రేతోర్యమను అధికార మందిరములోపలికి తీసికొనిపోయి, సైనికులనందరిని సమకూర్చుకొనిన తరువాత ఆయనకు ఊదారంగు వస్త్రము తొడిగించి, ముండ్ల కిరీటమును ఆయన తలమీదపెట్టి, - యూదుల రాజా, నీకు శుభమని చెప్పి ఆయనకు వందనము చేయసాగిరి. మరియు రెల్లుతో ఆయన తలమీదకొట్టి, ఆయనమీద ఉమ్మివేసి, మోకాళ్లూని ఆయనకు నమస్కారము చేసిరి. వారు ఆయనను అపహసించిన తరువాత ఆయనమీదన్న ఊదారంగు వస్త్రము తీసివేసి, ఆయన బట్టలాయనకు తొడిగించి, ఆయనను సిలువ వేయుటకు తీసికొనిపోయిరి. **-మార్కు 15:16-20.**

**✦ ప్రభువు ఆశ్చర్యకరమైన రాజు :**

**ప్రవచనం :** గుమ్మములారా, మీ తలలు పైకెత్తికొనుడి, పురాతనమైన తలుపులారా, మహిమగల రాజు ప్రవేశించునట్లు మిమ్మును లేవనెత్తికొనుడి. మహిమగల యీ రాజు ఎవరు? సైన్యములకధిపతియగు యెహోవాయే. ఆయనే యీ మహిమగల రాజు. **-కీర్తన 24:9,10.**

**నెరవేర్పు :** పిలాతు తిరిగి అధికారమందిరములో ప్రవేశించి యేసును పిలిపించి - యూదుల రాజువు నీవేనా? అని ఆయన నడుగగా యేసు - నీ అంతట నీవే యీ మాట అనుచున్నావా? లేక యితరులు నీతో నన్ను గూర్చి యిది చెప్పిరా? అని అడిగెను. అందుకు పిలాతు - నేను యూదుడనా యేమి? నీ స్వజనమును ప్రధానయాజకులును నిన్ను నాకు అప్పగించిరి గదా; నీవేమి చేసితివని అడుగగా యేసు - నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను. అందుకు పిలాతు - నీవు రాజువా? అని ఆయనను అడుగగా యేసు - నీవన్నట్టు నేను రాజునే; సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతివాడును నా మాట వినుననెను. అందుకు పిలాతు - సత్యమనగా ఏమిటి? అని ఆయనతో చెప్పెను. **-యోహాను 18:33-38.**

**✦ ప్రభువు నిర్భయంగా శత్రువులను ఎదుర్కొనుట :**

**ప్రవచనం :** యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు, నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణదుర్గము, ఎవరికి వెరతును? **-కీర్తన 27:1.**

**నెరవేర్పు :** ఆయన - నేనే ఆయనని వారితో చెప్పగా వారు వెనుకకు తగ్గి నేలమీదపడిరి. మరల - ఆయన మీరు ఎవనిని వెదకుచున్నారని వారిని అడిగెను. అందుకు వారు - నజరేయుడైన యేసునని చెప్పగా. యేసు వారితో నేనే ఆయనని మీతో చెప్పితిని గనుక మీరు నన్ను వెదకుచున్నయెడల వీరిని పోనియ్యుడని చెప్పెను. **-యోహాను 18:6-8.**

**✦ యూదుల ప్రభువు మరణమును కోరుట :**

**ప్రవచనం :** అయితే నా శత్రువులు నా విషయమై చెడ్డమాటలాడుచున్నారు - వాడు ఎప్పుడు చచ్చును? వాని పేరు ఎప్పుడు మాసిపోవును? అని చెప్పుకొనుచున్నారు. **-కీర్తన 41:5.**

**నెరవేర్పు :** ప్రధాన యాజకులును బంట్రౌతులును ఆయనను చూచి - సిలువ వేయుము సిలువవేయుము అని కేకలు వేయగా పిలాతు - ఆయనయందు ఏ దోషమును నాకు కనబడలేదు గనుక మీరే ఆయనను తీసికొనిపోయి సిలువవేయుడని వారితో చెప్పెను. **-యోహాను 19:6.**

అందుకువారు - ఇతనిని సంహరించుము, సంహరించుము, సిలువ వేయుము అని కేకలు వేసిరి. పిలాతు - మీ రాజును సిలువ వేయుదునా? అని వారిని అడుగగా ప్రధానయాజకులు - కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి. **-యోహాను 19:15.**

**✦ ప్రభువు నిర్దోషిగా తీర్చబడుట :**

**ప్రవచనం :** అన్యాయము లేకుండ నా సంగతి మరల విచారించుడి, మరల విచారించుడి, నేను నిర్దోషినిగా కనబడుదును. **-యోబు 6:29.**

**నెరవేర్పు :** పిలాతు ప్రధాన యాజకులతోను జనసమూహములతోను - ఈ మనుష్యుని యందు నాకు ఏ నేరమును కనబడలేదనెను. **- లూకా 23:4.**

అంతట పిలాతు ప్రధానయాజకులను అధికారులను ప్రజలను పిలిపించి - ప్రజలు తిరుగబడునట్లు చేయుచున్నాడని మీరు ఈ మనుష్యుని నా యొద్దకు తెచ్చితిరే ఇదిగో నేను మీయెదుట ఇతనిని విమర్శింపగా మీరితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడలేదు; హేరోదునకు కూడ కనబడలేదు. హేరోదు అతని మాయొద్దకు తిరిగి పంపెను గదా; ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు. **-లూకా 23:13,14,15.**

వారు - వీనిని సిలువ వేయుము సిలువ వేయుము అని కేకలు వేసిరి. మూడవమారు అతడు -ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెను ఇతని యందు మరణమునకు తగిన నేరమేమియు నాకు అగపడలేదు గనుక ఇతని శిక్షించి విడుదల చేతునని వారితో చెప్పెను. **-లూకా 23:21,22.**

**✦ ప్రభువు కొరడాలతో కొట్టబడుట :**

**ప్రవచనం :** దున్నువారు నా వీపుమీద దున్నిరి, వారు చాళ్లను పొడుగుగా చేసిరి. **-కీర్తన 129:3.**

**నెరవేర్పు :** అప్పుడు పిలాతు యేసును పట్టుకొని ఆయనను కొరడాలతో కొట్టించెను. సైనికులు ముండ్లతో కిరీటమును అల్లి ఆయన తలమీద పెట్టి ఊదారంగు వస్త్రము ఆయనకు తొడిగించి ఆయన యొద్దకు వచ్చిచ - యూదుల రాజా, శుభమని చెప్పి ఆయనను అరచేతులతో కొట్టిరి. **-యోహాను 19:1-3.**

**✦ ప్రభువు ఈటెతో పొడవబడుట :**

**ప్రవచనం :** కుక్కలు నన్ను చుట్టుకొనియున్నవి, దుర్మార్గులు గుంపుకూడి నన్ను ఆవరించియున్నారు, వారు నా చేతులను నా పాదములను పొడిచియున్నారు. **-కీర్తన 22:16.**

ఆయన బాణములు నన్ను చుట్టుకొనుచున్నవి, కనికరములేక నా తుండ్లను పొడిచెను, నా పైత్యరసమును నేలను పారబోసెను. **-యోబు 16:13.**

**నెరవేర్పు :** సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును నీళ్లును కారెను. **-యోహాను 19:34.**

**✦ ప్రభువు అంగీ కొరకు చీట్లు వేయుట :**

**ప్రవచనం :** నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు. **-కీర్తన 22:18.**

**నెరవేర్పు :** వారాయనను సిలువవేసి, ఆయన వస్త్రముల భాగము ఎవనికి రావలెనో చీట్లువేసి, వాటిని పంచుకొనిరి. ఆయనను సిలువ వేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను. **-మార్కు 15:24.**

... తరువాయి భాగం వచ్చే సంచికలో ...

**సువార్త ప్రకటించ గల్గి ప్రకటించకపోతే - ప్రభువునకు లెక్క అప్పగించాలి - జాగ్రత్త**

# ప్రార్థనలు

విజ్ఞాపన ప్రార్థనలు

1. వారసుని కొరకు ప్రార్థనలు
   - అ. అబ్రాహాము ప్రార్థన – ఆది॥ 15:2,3
   - ఆ. ఇస్సాకు ప్రార్థన – ఆది॥ 25:21-23
   - ఇ. హన్నా ప్రార్థన – 1 సమూ॥ 1:9-13
   - ఈ. జెకర్యా ప్రార్థన – లూకా 1:13
2. పట్టణముల కొరకు ప్రార్థనలు
   - అ. సొదొమ కొరకు అబ్రాహాము ప్రార్థన – ఆది॥ 18:23-33
   - ఆ. యెరూషలేము కొరకు హిజ్కియా ప్రార్థన – 2 రాజులు 19:14-19
   - ఇ. నీనెవె కొరకు ఆ పట్టణవాసుల ప్రార్థన – యోనా 3
3. ఇస్సాకుకు పెండ్లికుమార్తెను దయచేయుమని అబ్రాహాము దాసుని ప్రార్థన – ఆది॥ 24:12-14
4. అపాయముల నుండి విడుదల కొరకు చేయబడిన ప్రార్థనలు
   - అ. ఏశావు నుండి తప్పించుమని యాకోబు చేసిన ప్రార్థన – ఆది॥ 32:9-12
   - ఆ. సౌలు నుండి రక్షించుమని దావీదు చేసిన ప్రార్థన – కీర్తనలు 31,57,142
   - ఇ. తమ ప్రాణములను కాపాడుమని నావికులు చేసిన ప్రార్థన – యోనా 1:14
   - ఈ. సముద్రములో మునిగిపోకుండ తమను కాపాడుమని శిష్యులు యేసుకు చేసిన ప్రార్థన – మత్తయి 8:24,25
   - ఉ. సముద్రములో మునిగిపోకుండ తమను కాపాడుమని పేతురు యేసుకు చేసిన ప్రార్థన – మత్తయి 14:28-31
   - ఊ. పేతురుకు చెరసాల నుండి విడుదల కలిగించుమని యెరూషలేము సంఘము దేవునికి చేసిన ప్రార్థన – అపో.కా॥ 12:5
5. ఐగుప్తీయులపైకి తెగుళ్లను రప్పించవలసినదిగా మోషే దేవునికి చేసిన ప్రార్థనలు – నిర్గమ॥ 8-12
6. నీళ్లను రెండు పాయలుగా చీల్చుట కొరకు చేయబడిన ప్రార్థనలు
   - అ. ఎఱ్ఱ సముద్రమును రెండు పాయలుగా చీల్చుటకొరకు మోషే చేసిన ప్రార్థన – నిర్గమ॥ 14:21
   - ఆ. యొర్దాను నదిని రెండు పాయలుగా చీల్చుటకొరకు యెహోషువ చేసిన ప్రార్థన – యెహోషువ 4:15-18
7. దేవుని యొక్క మహిమను తనకు చూపుమని మోషే చేసిన ప్రార్థన – నిర్గమ॥ 33:18
8. క్రొత్త నాయకుని కొరకు మోషే చేసిన ప్రార్థన – సంఖ్యా॥ 27:15-17
9. యూదా ఇస్కరియోతు స్థానములో క్రొత్త వ్యక్తిని నియమించుటకొరకు అపొస్తలులు చేసిన ప్రార్థన – అపో॥ 1:24,25
10. కనాను దేశమును దర్శించుటకొరకు మోషే చేసిన ప్రార్థన – ద్వితీ॥ 3:23-25
11. బంగారు దూడ విగ్రహమును చేసి అహరోను పాపము చేయగా అతనిని క్షమించవలసినదిగా మోషే దేవునికి చేసిన ప్రార్థన – ద్వితీ॥ 9:20
12. సూర్యుడు అస్తమించకుండా యెహోషువ చేసిన ప్రార్థన – యెహోషువ 10:12
13. ఒక సూచనకొరకు గిద్యోను చేసిన ప్రార్థన – న్యాయా॥ 6:36-40
14. తనను బలపరచవలసినదిగా సమ్సోను చేసిన ప్రార్థన – న్యాయా॥ 16:28-31
15. క్షమాపణ వేడుకొనుచు చేయబడిన ప్రార్థనలు
   - అ. జనసంఖ్య చూచి తాను చేసిన పాపమును పరిహరింపుమని దావీదు చేసిన ప్రార్థన – 2 సమూ॥ 24:10
   - ఆ. బత్షెబతో తాను చేసిన నీతివిరుద్ధమైన క్రియను క్షమించవలసినదిగా దావీదు చేసిన ప్రార్థన – కీర్తనలు 32, 51
   - ఇ. మనష్షే, తనను క్షమించవలసినదిగా మరియు యెరూషలేమునకు అనగా అతని రాజ్యమునకు అతనిని దేవుడు తిరిగి తీసికొని వచ్చినప్పుడు చేసిన ప్రార్థన – 2 దిన॥ 33:11-13
   - ఈ. తాను గర్వించినందున క్షమాపణ వేడుకొనుచు యోబు చేసిన ప్రార్థన – యోబు 40:3,4; 42:6
   - ఉ. తప్పిపోయిన కుమారుడు బుద్ధి వచ్చినప్పుడు చేసిన ప్రార్థన – లూకా 15:17-19
16. వివేకముగల హృదయమును దయచేయుమని సొలొమోను చేసిన ప్రార్థన – 1 రాజులు 3:5-9
17. వర్షము కొరకు చేయబడిన ప్రార్థనలు
   - అ. వర్షము కొరకు ఏలీయా చేసిన ప్రార్థన – 1 రాజులు 18:42,43
   - ఆ. వర్షము కొరకు యోవేలు చేసిన ప్రార్థన – యోవేలు 1:19,20
18. ఆకాశమునుండి అగ్నిని కురిపించవలసినదిగా చేయబడిన ప్రార్థనలు
   - అ. అగ్నికొరకు దావీదు చేసిన ప్రార్థన – 1 దిన॥ 21:26
   - ఆ. అగ్నికొరకు ఏలీయా చేసిన ప్రార్థన – 1 రాజులు 18:36,37
19. తమ సేవకునికి ఆత్మీయ దర్శనము కలుగజేయుమని ఎలీషా చేసిన ప్రార్థన – 2 రాజులు 6:17
20. దీర్ఘాయుష్షు కొరకు హిజ్కియా చేసిన ప్రార్థన – 2 రాజులు 20:1-3

**REAL CHRISTIAN FAMILY**

**HEAD OFFICE :**
# 8-11-23,
Beside Latha Hospital,
Old Gajuwaka,VSP-26.AP.
rcf2011mnm@gmail.com

**BRANCH OFFICE :**
PO.Box No:1130,
Malkapuram,
A.K.C.colony,
Visakhapatnam -11

## క్రీస్తు (సువార్త) ప్రేమ

### క్రియా రూపములో - రేభాక గ్రామములో

**అనకాపల్లి, న్యూస్‌లింక్ :-** అనకాపల్లి సమీప గ్రామము రేభాక అనే ప్రాంతములో సహోదరుడు జాన్‌సుందర్, మణి ల ద్వారా విశాఖపట్టణము బేతేల్ ప్రేయర్ మందిర్ నుంచి సుమారు 40 మంది సువార్త ప్రకటించు నిమిత్తము వెళ్ళారు. ఆ ప్రాంతమంతా ఇంటి ఇంటికి వెళ్ళి దేవుని సువార్త పత్రికలు పంచారు. అలాగే హుదూద్ తుఫాన్ బాధితులకు సంఘము సమకూర్చిన రైస్ మరియు కూరగాయలను వారికి అందించారు. దానితో ఆ ప్రాంత ప్రజలు ప్రభుత్వ సహాయం అందకపోయిన యేసుబాబు బిడ్డల సహాయం అందింది అని సంతోషము, యేసుబాబు ప్రేమ అంటే ఇలా ఉంటుందా! అని వాళ్ళు ఎంతో తృప్తిని వ్యక్తము చేసి ప్రభువును మహిమపరిచారు. అనంతరం సహోదరి మణి గారి కుటుంబము చక్కని విందును ఏర్పరచినారు. ఆపై వారి కుటుంబమంతా మనస్ఫూర్తిగా, అక్కడ కూడా సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరి చర్చికి స్థలమును మంజూరు చేశారు. ఆ స్థలములో సంఘమంతా చేరి ప్రార్థనలు చేసి ప్రభువును మహిమ పరిచారు. ప్రకటించిన సువార్త ఫలించునట్లు, ఆ స్థలములో మందిరము నిర్మించునట్లు దయతో మీ అనుదిన ప్రార్థనలో జ్ఞాపకము చేసుకోగలరని మనవి చేయుచున్నాము.

## సువార్త ప్రకటించాలని ఆశ ఉందా? అయితే...రా!

సువార్త ప్రకటించాలని ఆశ ఉంది కాని నేను ఎలా ప్రకటించాలి? నేను ఎవరితో వెళ్ళాలి? నన్ను ఎవరు ప్రోత్సహించు వారు లేరే? అని కుమిలిపోతున్న నీకు శుభవార్త - రా!... నీ కోసము భారముతో కూడిన సువార్త, టీమ్ సిద్ధముగా ఉన్నది.

**వివరములకు : 9396235152.**

**"రియల్ క్రిస్టియన్ ఫ్యామిలీ'**

మంత్లీ న్యూస్ పేపర్ సబ్‌స్క్రిప్షన్

**"రియల్ క్రిస్టియన్ ఫ్యామిలీ" అనే ఈ మంత్లీ న్యూస్ పేపర్ మీకు నచ్చితే! నచినవి-అందరికి చెప్పండి, నచ్చకపోతే నచ్చనిది-మాకే చెప్పండి. ఈ పత్రిక ప్రతి నెల పోస్టు ద్వారా పొందవచ్చు. అంతేకాకుండా ఎస్.ఎమ్.ఎస్, ఫోన్, ఈమెయిల్, ఫేస్‌బుక్ ద్వారా కూడా కోరవచ్చు.**

ఎస్.ఎమ్.ఎస్ : **9396235152**,
ఫోన్ : **9542786220**,
ఈమెయిల్ :
rcf2011mnm@gmail.com,
ఫేస్‌బుక్ : nava jeevan kumar.
అతి త్వరలో **వెబ్‌సైట్** ద్వారా కూడా పొందవచ్చు.

RNI -AP TEL/2013/48347



## సంఘములో నేడు ఉండవలసిన ఉన్నత సత్యాలు

# యాజకత్వము

సంఘములలో యాజకత్వము ప్రధానమైన విషయం. దీని విషయమై అనేకులు అనేక భావాలు కలిగియుండుట మనం చూడగలము. నేడు నిజంగా యాజకత్వము పట్ల మనకు సరియైన అవగాహన కలుగకపోవటం మనకు చాలా నష్టం జరిగిస్తోంది. అందుకే ఈ సంచికలో చిన్న ప్రయత్నం మాకు కలిగిన అవగాహన మేరకు కొంతైనా వివరాలు అందిస్తే మంచిదని ఈ వ్యాసం వ్రాయుచున్నాను. యాజకత్వం మధ్యవర్తిత్వాన్ని సూచిస్తుంది. దేవునికి మానవులకు మధ్య పాపం అగాధాన్ని సృష్టించగా, యాజకుడు తన యాజక ధర్మము చేత మానవునికి దేవునికి మధ్య వారధిగా నిలిచాడు. దీనిని మనం వాక్యం ద్వారా పరిశీలిద్దాం.


**మొదటిగా యాజకుడెవరు ?**

యాజకుడు దేవుని చేత పరిశుద్ధపరచబడినవాడు.. - నిర్గమ॥ 29:44
యాజకుడు దేవునికి ప్రతిష్ఠితమైనవాడు.. - లేవి॥ 21:6; 21:7
యాజకుడు దేవుని సన్నిధిని సంచరించువాడు, నివసించువాడు.. - నిర్గమ॥ 27

**రెండవదిగా యాజకుని ధర్మాలు మరియు విధులు ఏమిటి ?**

1. పరిశుద్ధ స్థలమును కాపాడువాడు.. - సంఖ్యా॥ 3:38
2. మందిరములో దీపము వెలిగించువాడు.. - నిర్గమ॥ 27:20-21
3. బలిపీఠము మీద నిత్యము మంట మండుచుండ చేయువాడు.. - లేవి॥ 6:12-13
4. పరిమళ ద్రవ్యము ధూపములు వేయువాడు.. - నిర్గమ॥ 30:7-8
5. బలులు అర్పించువాడు.. - లేవి॥ 1:1-17
6. దేవుడు ప్రజలను దీవించుటకు వారు మధ్యవర్తులు.. - సంఖ్యా॥ 6:23-26
7. దేవుడిచ్చిన విధులను ప్రజలకు బోధించుట.. - లేవి॥ 10:11
8. ప్రజలకు ఉన్న కుష్టను పరీక్షించి నిర్ధారించుట.. - లేవి॥ 13:2
9. ప్రజల సమీకరణకు, కదలికలపై బూరలు ఊదుట.. - సంఖ్యా॥ 10:8
10. ప్రజలను అపవిత్రతలో నుంచి పవిత్రపరచుట.. - లేవి॥ 15:15
11. నిబంధన మందసమును మోయుట.. - యెహోషువ 3:6

దేవుని యొక్క ప్రణాళికలో పైనున్న విధులు కేవలం యాజకులు మాత్రమే చేయాలి. ఏ ఇతర వ్యక్తులు చేయుటకు దేవుడు అనుమతి నియ్యలేదు. మరియు ప్రజలు వీటిని చేయుటకు అర్హులు కారు.




పై పటాన్ని చూసి మనం కొంత అవగాహన చేసికొనవచ్చును.

**హెబ్రీ॥ 5:1** ప్రతి ప్రధాన యాజకుడును మనష్యులలో నుండి ఏర్పరచబడినవాడై, పాపముల కొరకు అర్పణలను బలులను అర్పించుటకు దేవుని విషయమైన కార్యములు జరిగించుటకై మనుష్యుల నిమిత్తము నియమింపబడెను. ఈ యాజకుడు మనుష్యుల నిమిత్తము నియమింపబడినవాడు. కాని అతడు బలహీనుడని వాక్యము స్పష్టంగా తెలియజేయుచున్నది.

**హెబ్రీ॥ 5:2** తాను కూడ బలహీనత చేత ఆవరింపబడియున్నందున అతడు ఏమియు తెలియనివారియెడలను త్రోవతప్పినవారి యెడలను తాలిమి చూపగలవాడై యున్నాడు. అనగా ఈ యాజకుడు తాను కూడ బలహీనత కలిగియుండుట చేత ప్రజల పట్ల తాను కనికరము చూపగలవాడుగా ఉన్నాడు. ఇది ఒక విధంగా దేవుడు యాజకుని ఏర్పరచి తన కనికరాన్ని ఘనంగాను పరోక్షంగాను చాటుకొన్నాడు. కాని ఈ యాజకుని బలహీనత మామూలు ప్రజలకు విమోచన ఇచ్చేదిగా కనిపించదు.

**హెబ్రీ॥ 5:3** ఈ హేతువు చేత ప్రజల కొరకు ప్రాయశ్చిత్తం చేయు యాజకుడు తన కోసము కూడ తనకు తానె ప్రాయశ్చిత్తం చేసుకొనవలసినవాడుగా మనకు కన్పిస్తాడు.

**ఈ యాజకుని బలహీనతలు :**

1. ఇతడు తనకు తాను కూడా బలహీనుడుగా జీవించు మామూలు మానవుడే.
2. ఇతడు దేవుని సన్నిధిని చేరుటకు తప్పనిసరిగా తనకోసం తాను ప్రాయశ్చిత్తం చేయాలి.
3. ఇతడు మామూలు క్రమం మాదిరిగా అనగా ఆచారం మాదిరిగా కార్యక్రమాలు చేయువాడుగా మారాడు, కాని ఈ యాజకుడు ప్రజలకు విడుదల ఇవ్వలేని వాడు.
4. ఇతడు నిత్యము నిలుచుండువాడుగా కన్పించలేదు కాని కొంతకాలము మట్టుకే పరిమితం అయినవాడుగా కన్పిస్తాడు.. ఇతని అనంతరము మరియొకని వెదుకవలసివస్తోంది.
5. ఇతడు ప్రతి సంవత్సరం చేసిన కార్యక్రమాన్నే చేస్తూ ప్రజలకు ఒకేసారి ప్రాయశ్చిత్తం చేయలేని వాడుగా మారాడు.
6. ఇతడు మాత్రమే తెరలోపలికి వెళ్లువాడుగా ఉన్నాడు కాని ప్రజలు నిత్యము బయట నిలుచువారుగా ఉన్నారు.
7. ఇతని క్రియలు వలన పాపము నిలిచియుండినది మరియు బలులు నిలిచియుండినవి. ఈ విధమైన బలహీనతలచేత ఈ యాజకుడు.
   అ) మానవుల కొరకు నిలిచియుండి, పడిపోవు వానిగాను,
   ఆ) కార్యక్రమాలు చేయుచుండియు ఫలితం ఇవ్వలేని వానిగాను,
   ఇ) శాశ్వత పరిష్కార మార్గం కనుగొనలేనివానిగాను, ఇవ్వలేనివానిగాను,
   ఈ) పాపం బలాన్ని తుడిచివేస్తూ కూడా, నిలిపియుంచువానిగాను,
   ఉ) నిజమైన దైవమానవ సంబంధాలు నెలకొల్పలేనివానిగాను,

మనకు కనిపిస్తూ విలువలు సంఘంలో లేకపోవటానికి కారకుడుగా పరోక్షంగా కనిపిస్తాడు. దీని ద్వారా యాజకుని నిస్సహాయత మరియు మానవునికి ఏమి చేయలేని దశను మనం చూడగలము.

- మిగిలినది వచ్చే సంచికలో...

ఈ పత్రికను FACEBOOK లో కూడా చదువవచ్చు
FACEBOOK ID : navajeevankumar

# యాజకులు
## వేరే ఇంకా ఉన్నారా ?

గత సంచిక తరువాయి ...

### ఇతని (యేసుక్రీస్తు) ఆధిక్యతలు ?

1. ఇతడు నరుడు కాడు, నరునిగా వచ్చిన దైవకుమారుడు,
2. ఇతడు బలహీనుడు కాడు, హెబ్రీ॥ 7:26
3. ఇతడు తన కొరకు ముందుగా బలులు అర్పించుకొనవలసిన వాడు కాడు,
4. మాటిమాటికి బలులు అర్పించువాడు కాడు, హెబ్రీ॥ 7:28
5. బలహీన జీవుల రక్తమును తీసికొని అర్పింపలేదు కాని తన స్వంత పరిశుద్ధ రక్తమును తీసికొని తెరలోపలికి ప్రవేశించినవాడు. హెబ్రీ॥ 9:12
6. ఇతడు అంతమొందువాడు కాడు, నిత్యము జీవించువాడు.
7. ఇతడే నిజమైన మధ్యవర్తి, 1 తిమోతి 2:5
8. ఇతడు తెర వెలుపల ప్రజలను నిలువబెట్టినవాడు కాడు, ఎఫెస్సీ॥ 2:18
9. తన శరీరమను తెర చించి, సన్నిధిలో తెరను చించాడు, పరిశుద్ధ స్థలములో మనలను కూర్చుండబెట్టుడు, ప్రస్తుతము మనము బయటివారము కాదు.

**అందుకే (ఆయన మరణించిన వేళ) గర్భాలయములో తెర చినిగిందా ?**
అవును, మానవుడు మధ్యవర్తిని ఆశ్రయించనవసరం లేదు, కేవలం మనకు ప్రధాన యాజకునిగా వచ్చిన యేసుక్రీస్తును విశ్వసించి ఆయనయందు జీవిస్తే చాలు ఆయన సహవాసం పొందినవాడు అవుతాడు.

**మరి యాజకత్వం అంతమొందినదా ?**

ఈ విషయం బహు మర్మమైనది, ఇందు నిజంగా సత్యం నేడు అనేక సంఘాలు గుర్తించక లేకపోవటం చాలా విచారం.

**ఉదాహరణకు ఒక విషయం :**

ఒకానొక సందర్భములో ఒక విశ్వాసి నా యొద్దకు వచ్చి తన బాధలు చెప్పుకొంటూ ఉన్నాడు, తన గోడు నేను వింటూ అతనిని పరిశీలిస్తున్నాను, వాస్తవానికి ఈ విషయం చాలా సున్నితంగా మీకు అనిపించవచ్చు, కాని దీని విషయం మీరు పూర్తిగా శ్రద్ధగా గమనించండి. ఆ వ్యక్తి అంతా చెప్పిన తర్వాత నాతో, అయ్యా! మీరు ఈ విషయం ప్రార్థించండి అన్నాడు. నేను అడిగాను, మరి నీవు ప్రార్థన చేయువా? నా ప్రశ్నకు అతని సమాధానం ఎంతో బాధ కలిగించింది, అయ్యా! మీరు యాజకులు కదా మాబోటి వారి కంటె మీ ప్రార్థన బలంగా ఉంటుంది కదా? మేము మొర్రపెట్టినా దేవుడు వింటాడా? అన్నాడు. నేను చాలా విచారించాను. నేను అతనికి సత్యం చెప్పటానికి చాలా ప్రయత్నించాను.

1. పేతురు 2:9 లో ఇలా వ్రాయబడి ఉంది. మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలచినవాని గుణాతిశయమును ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును రాజులైన యాజక సమూహమును పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు. మనమంతా యాజక సమూహమై యున్నాము అని అతనికి వివరించుటకు నాకు చాలా సమయం అవసరమొచ్చింది. నిజమునకు దేవునికి కొందరితోనే సంబంధము ఉంది, వారి మీద ఆధారపడాలి అని నేడు నేర్పిస్తున్న అనేకమంది సేవకులు యాజకులు నేడు ఎందరులేరు?

- పాస్టర్ రాజా బాబు, డైరెక్టర్
గ్రేస్ గాస్పల్ టి.వి.ఛానల్, మచిలీపట్నం.

తరువాయి భాగం వచ్చే సంచికలో...

యేసు - నీ కోరికను సిద్ధింపజేసి - నీ ఆలోచన యావత్తును - సఫలపరచును గాక !

*Printed, Published, Edited and Owned by Sandiparthi Nageswara Rao, D.No. 8-11-25, Beside Latha Hospital , Heaven way Road, Old Gajuwaka, Visakhapatnam - 530 026, Andhra Pradesh. Ph : 9396235152. Printing : SRI NEW TEC PRINT NEEDS.*